అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



అచలగురు మాతాజీ శీలం సూర్యకాంతమాంబ సమేత
అచలగురూజీ వెంకటదాసార్యులు

సత్య దీపిక

ఉదయం

తెలుగు దినపత్రిక

SDU NEWS
SATHYA DEEPIKA UDAYAM
PLEASE SUBSCRIBE | SHARE | LIKE

ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 113 | మంగళవారం 27-10-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00

తీవ్రతుపానుగా... అర్నబ్

రానున్న 12 గంటల్లో అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం

బుధవారం ఉదయం యానాం సమీపంలో తీరం దాటే సూచనలు
తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం
రేపు, ఎల్లుండి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
కోనసీమ సహా ఐదు జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన
కోస్తా తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
చెట్లు, భారీ హోర్డింగులు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలి
తుపాను కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న విపత్తుల నిర్వహణ సంస్థ
కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలకు భారీ వర్షాల ముప్పు
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్
-రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్



అమరావతి, **సత్యదీపిక ఉదయం**

తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలోని అర్నబ్ తీవ్రతుపానుగా బలపడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.ఇది గడిచిన 6 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా కదులు తుందన్నారు. ప్రస్తుతానికి గోపాల్‌పూర్(ఒడిశా) 490 కి.మీ, విశాఖపట్నంకు 490 కి.మీ, కాకినాడకు 560 కి.మీ, మచిలీపట్నంకు 660 కి.మీ, బాపట్లకు 730 కి.మీ

మిగతా 2లో

నో కాంప్రమైజ్....

-మూడు పార్టీలు కలిసి కట్టుగా పనిచేయాల్సిందే
-చెప్పాం-చేస్తున్నాం ప్రచారాన్ని ముమ్మరం చేయాలి
-పార్టీ ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- మూడు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేయాల్సిందే
- 'చెప్పాం--చేస్తున్నాం' ప్రచారాన్ని ముమ్మరం చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి
- మిత్రధర్మం పాటించడంలో రాజీ పడొద్దు
- ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలి
- హామీల అమలుతో ప్రజల్లోకి వెళ్తున్నాం
- . సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి లబ్ధి చేకూరేలా పాలన



అమరావతి, **సత్యదీపిక ఉదయం** చెప్పాం-చేస్తున్నాం ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలను ఆదేశించారు. మిత్రధర్మాన్ని పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం పార్టీ నేతలతోటెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి ప్రజల వద్దకు వెళ్తున్నాం.
ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి. 2024 ఎన్నికల్లో లభించిన అద్భుత విజయం తర్వాత ఇచ్చిన హామీలను నెరవెరుస్తూ వస్తున్నాం. 151 సీట్లతో గెలుపొంది అరాచకాలు చేసిన గొడ్డలి పార్టీకి కేవలం 11

- మిగతా 2లో పేజీలో

ఏపీలో డీజీపీ, ఐజీపీల సమావేశం..



మిగతా 2లో

- డిసెంబరు 4 నుంచి 6 వరకు తిరుపతిలో ఉన్నతస్థాయి పోలీస్ సదస్సు
- సమావేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు
- IISER వేదికగా డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సమావేశం
- ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏపీ సచివాలయంలో ఉన్నతాధికారుల సమీక్ష
- ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశాలు

అర్నబ్' తీవ్ర తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు.
- రైతులు పంటల సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- పంటల కంటే ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



2లో

IIIT జంక్షన్ వద్ద మరో మూడు నెలలు ట్రాఫిక్ ఆంక్షలు



ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులతో వాహనదారులకు ఇబ్బందులు
ఆఖీ గేట్ నంబర్-1 నుంచి గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ వరకు రహదారి మూసివేత
వాహనాలకు ఆంక్షలు
గచ్చిబౌలి జంక్షన్ నుంచి ఇంటిరానగర్ మీదుగా వెళ్లాలని సూచన
లింగంపల్లి నుంచి ఆఖీ వెళ్లే వాహనాలకు దారి మళ్లింపు
ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసుల సూచన

హైదరాబాద్, **సత్యదీపిక ఉదయం**

సైబరాబాద్ IIIT జంక్షన్ వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనుల నేపథ్యంలో ఆంక్షలు పొడిగించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మరో 3 నెలల పాటు ఈ ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రేపు (మంగళవారం) నుంచి ఆఖీ గేట్ నంబర్- 1 నుంచి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు రహదారిని మూసివేస్తున్నట్లు వెల్లడించారు. రాడిసన్ హోటల్ నుంచి IIIT జంక్షన్

మిగతా 2లో

తీవ్ర వాయుగుండంగా అర్నబ్..
జగన్‌పై వ్యక్తిగత దాడి



అమరావతి, **సత్యదీపిక ఉదయం**అర్నబ్ తుఫాను నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తత, అత్యున్నత సన్నద్ధత, ముందస్తు ప్రణాళికతో అన్ని స్థాయిల్లో యంత్రాంగం పని చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న వాతావరణ శాఖ సమాచారం నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలి. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి అని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలని ఆదేశించారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకూడదు. ఆస్తి నష్టం సాధ్యమైనంత తగ్గించాలని సీఎం సూచించారు.

- అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలి.
- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- తుఫాను ముప్పుపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి
- ఈ వారంలో కాన్పులు అయ్యే గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలి
- బాపట్ల మధ్య అక్టోబర్ 28న తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు

మిగతా 2లో



మంత్రి కందుల దుర్గేష్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

- ఎక్సలెన్స్ ఇన్ టూరిజం లీడర్‌షిప్ అవార్డు
- ఎక్సలెన్స్ ఇన్ టూరిజం లీడర్‌షిప్ అవార్డు
- ఆంధ్రప్రదేశ్‌కు అవార్డ్ ఆఫ్ మెరిట్ పురస్కారం
- పర్యాటక రంగంలో వినూత్న సంస్కరణలకు గుర్తింపు
- ఏపీ పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం
- కలకత్తాలో 69వ ఇండియన్ ట్రావెల్ కాంగ్రెస్ సదస్సులో అవార్డుల ప్రదానం

2లో

తుపాను ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

అమరావతి,: బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడనం తుపానుగా మారే అవకాశమున్న నేపథ్యంలో రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శనివారం మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తుపాను ప్రభావం, సముద్రంలో ఉన్న మత్స్యకార బోట్ల పరిస్థితి, తీరప్రాంత జిల్లాల్లో చేపట్టిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ నెల 26 నాటికి తుపాను ఏర్పడి, 28 నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 30,043 మత్స్యకార బోట్లలో 29,952 బోట్లు హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో సురక్షితంగా ఉండగా, మరో 91 బోట్లు సముద్రంలో ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 37, అనకాపల్లిలో 1, కాకినాడలో 1, కృష్ణా జిల్లాలో 20, బాపట్ల జిల్లాలో 32 బోట్లు ఉన్నట్లు తెలిపారు. సముద్రంలో ఉన్న 91 బోట్లలో 72 మెకనైజ్డ్, 19 మోటరైజ్డ్ బోట్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ బోట్లన్నీ వీలైనంత త్వరగా సురక్షితంగా తీరానికి చేరుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకార సంఘాలు, బోటు యజమానులు, హార్బర్ అధికారులు, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో ఉన్న ప్రతి బోటు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉందని, రాష్ట్రంలోని 12 తీరప్రాంత జిల్లాల పరిధిలో 555 సముద్ర మత్స్యకార గ్రామాలు, 350 చేపల ల్యాండింగ్ కేంద్రాలు, ఉన్నాయని తెలిపారు. భారత వాతావరణ శాఖ ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరూ తమ పడవలతో తక్షణమే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని తీరప్రాంత జిల్లాల్లో జిల్లా మత్స్యశాఖ అధికారులు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ రామశంకర్ నాయక్ మంత్రికి వివరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, తీరప్రాంత గ్రామాల్లో తుపాను హెచ్చరికలపై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల తదితర తీరప్రాంత జిల్లాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రంలో అలల ఉద్ధృతి, బలమైన గాలుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని బోట్లు, వలలు, ఇతర మత్స్యకార సామగ్రిని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు తుపాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ముఖ్యంగా కోత దశకు చేరుకున్న పంటలు, కోసిన ధాన్యం, ఉద్యాన పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు అవసరమైన ఆధారాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆక్వా రైతులు చెరువుల గట్లు, నీటి పారుదల వ్యవస్థలు, విద్యుత్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు..

అత్యధికంగా జెడ్పీటీసీలకు 3,315, ఎంపీటీసీలకు 25,016 నామినేషన్లు రావడం ఎన్నికల వేడిని సూచిస్తోంది.నామినేషన్ల దాఖలులో అధికార, ప్రతిపక్ష పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ తరఫున అత్యధికంగా 22,013 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 20,556 మంది నామినేషన్లు వేశారు. ఇక జనసేన పార్టీ తరఫున 4,609 మంది, బీజేపీ నుంచి 1,150 మంది తమ అభ్యర్థిత్వాలను నమోదు చేసుకున్నారు.అదేవిధంగా, జెడ్పీటీసీ స్థానాలకు కూడా ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. టీడీపీ తరఫున 2,078 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్ఆర్సీపీ నుంచి 1,815 మంది బరిలో నిలిచారు. కూటమిలోని జనసేన పార్టీ నుంచి 679 మంది, బీజేపీ తరఫున 255 మంది నామినేషన్లు వేశారు.

జగన్‌పై కూటమి విమర్శలు

ఇంత భారీ సంఖ్యలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలైనప్పటికీ, కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. జగన్ తీరును 'హిట్ అండ్ రన్' థియరీగా వారు అభివర్ణిస్తున్నారు. కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే బెంగళూరు నుంచి అమరావతికి వస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేసి తిరిగి వెళ్లిపోతున్నారని కూటమి పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించకుండా జగన్ వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. అదేసమయంలో వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీ దాడులకు పాల్పడుతున్నారని రాష్ట్ర ఎన్నికల కమీషన్ కు పలు మార్లు ఫిర్యాదు చేయడం తో హైకోర్టు, సుప్రీంకోర్టు గుమ్మం తట్టింది. మొత్తం మీద నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో పరిషత్ ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కింది.

స్థానిక ఎన్నికలపై జగన్ ది 'హిట్ అండ్ రన్' ధోరణి

గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, గత ప్రభుత్వ హయాంలో ఒక రాజకీయ పార్టీయే శాంతిభద్రతలకు అతిపెద్ద సమస్యగా మారిందని విమర్శించారు. వైఎస్ హయాంలో ఫ్యాక్షనిజంతో ప్రజలు భయపడితే, 2019 తర్వాత వైసీపీ పాలనలో ఎన్నికలను అపహాస్యం చేసి, పాలనను పూర్తిగా విధ్వంసం చేశారని ఆరోపించారు. స్వయానా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన ప్రాణాలకు భయం ఉందని ఫిర్యాదు చేసే దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ అరాచకాలకు, విధ్వంసకర పాలనకు విసిగిపోయిన ప్రజలు 2024 ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్లను సాధించిందని, ఇది ప్రజలు మాపై పెట్టుకున్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పనిలో నిమగ్నమయ్యామని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించిందని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని గుర్తుచేశారు.

పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడం ద్వారానే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని, కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, అవి ఉత్పత్తి దశకు వెళ్లేంత వరకూ ఫాలో అప్ చేసే పటిష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్న విషయాన్ని పొరుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశం గుర్తిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

తుఫాన్ సూచన.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు ఒడిశాలో పర్యటించాల్సి ఉన్నది. అయితే ఆ రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో తుఫాన్ ఏర్పడే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా పడింది.

అక్టోబర్ 28 నుంచి ప్రారంభం కావాల్సిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా పర్యటన వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. 'ప్రతికూల వాతావరణ సూచనలు, భద్రతా జాగ్రత్తల దృష్ట్యా రాష్ట్రపతి పర్యటనను వాయిదా వేశాం' అని ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి చెందిన ఒక అధికారి పేర్కొన్నారు.కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్టోబర్ 28, 29 తేదీల్లో ఒడిశాలోని రైరంగపూర్‌తో పాటు సొంత జిల్లా అయిన మయూర్‌భంజ్‌ను సందర్శించాల్సి ఉన్నది. అయితే మయూర్‌భంజ్ జిల్లా యంత్రాంగం తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రపతి పర్యటన రద్దు కాలేదు. కేవలం తేదీలు మాత్రమే మారాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నవంబర్ 4, 5 తేదీల్లో మయూర్‌భంజ్‌లో పర్యటిస్తారని ఆ అధికారి వివరించారు.మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం తెలిపింది. అక్టోబర్ 28 ఉదయానికి ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల మధ్య ఎక్కడో ఒకచోట తీరం దాటవచ్చని పేర్కొంది.

సమాధానం చెప్పే దమ్ములేక జగన్‌పై వ్యక్తిగత దాడి

మార్గదర్శకాలను పాటించకుండా, ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న దారుణాలను కప్పిపుచ్చేందుకు వాస్తవాలను వక్రీకరించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని సజ్జల ఆరోపించారు. నామినేషన్ల అడ్డగింతపై ఉన్న ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించకుండా అధికారుల నివేదికలతోనే సరిపెట్టుకోవడం ద్వారా అసలు వాస్తవాలను కప్పిపుచ్చే పరిస్థితి ఏర్పడుతోందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేసి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, సరైన పత్రాలు సమర్పించినా తిరస్కరించారన్న ఆరోపణలపై సమాధానం చెప్పకుండా జగన్ పై వ్యక్తిత్వ హననానికి దిగడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గృహనిర్బంధం చేయడం, పోలీసులతో అడ్డంకులు సృష్టించడం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల తర్వాత కూడా ముళ్ల కంచెలు వేయడంపై ప్రభుత్వం, పోలీసు శాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పేరుతో టీడీపీ నకిలీ నామినేషన్లు దాఖలు చేసిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరారు. నామినేషన్ల అడ్డగింతపై వచ్చిన ఫిర్యాదులను సీసీటీవీ ఫుటేజీ, నామినేషన్ రసీదులు, తిరస్కరణ కారణాలతో పరిశీలించకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల నివేదికలతోనే సరిపెట్టుకోవడం సరికాదన్నారు. గతంలో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికల ప్రక్రియపై మాట్లాడే ముందు తన గత వైఖరిపై సమాధానం చెప్పాలని అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పకుండా జగన్ కుటుంబం, ఆస్తుల గురించి మాట్లాడటం, ఎల్లో మీడియా ద్వారా తప్పుడు వార్తలు ప్రచారం చేయించడం చంద్రబాబు రాజకీయ పద్ధతిగా మారిందని విమర్శించారు. తనపై వస్తున్న ఆరోపణలకు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు ఆధారాలతో సమాధానం చెప్పాలని, వ్యక్తిగత విమర్శలతో అసలు సమస్యల నుంచి తప్పించుకోలేరని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.వైఎస్ జగన్ లేవనెత్తిన అసలు ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్న చిత్తశుద్ధి చంద్రబాబు లో లేదని స్పష్టమవుతోంది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిందిపోయి, జగన్ పై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం అత్యంత ముఖ్యం, కానీ ఆ ప్రాథమిక అంశాన్నే పక్కనపెట్టి రాజకీయ నాటకాలు చేస్తున్నారు. తమ అభ్యర్థులకు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారన్న ప్రశ్నకు మాత్రం ఎందుకు సమాధానం చెప్పడం లేదు? ఎక్కడెక్కడ నామినేషన్లు తిరస్కరించారు, ఎక్కడ పత్రాలు చించివేశారు,

భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయనే వద్దన్నా

అమరావతి,: వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసిన ఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు. మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు.బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణతలో ప్రభుత్వ వైద్య కళాశాలల ముందంజ

అమరావతి, రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ప్రైవేటు కళాశాలల కంటే మెరుగైన ఉత్తీర్ణతను నమోదు చేస్తున్నాయి. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం గణాంకాల ప్రకారం 2025--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 88.11 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ప్రైవేటు కళాశాలల్లో 80.68 శాతమే ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత 7.43 శాతం మేర అధికంగా నమోదైంది. 2025--26 విద్యా సంవత్సరంలో సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడలో 93.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో 93.20 శాతం, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతిలో 92.50 శాతం, పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 92 శాతం ఉత్తీర్ణత నమోదయ్యాయి. కర్నూలులో 90.80 శాతం, మచిలీపట్నంలో 88.67 శాతం, రాజమహేంద్రవరంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇతర కళాశాలల్లో ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరులో 86.86 శాతం, నంద్యాలలో 86.51 శాతం, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడలో 86 శాతం, శ్రీకాకుళంలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనంతపురంలో 84.92 శాతం, ఏలూరులో 84.67 శాతం, గుంటూరులో 84 శాతం, విజయనగరంలో 83.33 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే కొన్ని కళాశాలల్లో ఉత్తీర్ణత తగ్గగా, మరికొన్ని కళాశాలల్లో పెరిగింది. ముఖ్యంగా పాడేరు, మచిలీపట్నం, ఆంధ్ర వైద్య కళాశాలల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి.

2024--25లో ప్రభుత్వ కళాశాలల్లో...

2024--25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 93.48 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేటు కళాశాలల్లో 88.64 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల మొత్తం ఉత్తీర్ణత 91 శాతంగా నమోదైంది. ఆ ఏడాది రాజమహేంద్రవరం వైద్య కళాశాలలో 98 శాతం, గుంటూరులో 97.60 శాతం, ఏలూరులో 97.33 శాతం, కర్నూలులో 96.80 శాతం, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతిలో 96.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడలో 93.71 శాతం, ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరులో 93.71 శాతం, ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో 91.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ వివరాలను ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సాయి సుధీర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీకాంత్ తెలిపారు.

గచ్చిబౌలిలో లెదర్ పరిశ్రమకు కొత్త ప్రోత్సాహం

డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు పూర్తిగా మార్గనిర్దేశం చేశారు. లెదర్ ఉత్పత్తులకు వాల్యూ యాడెడ్ చేసి మార్కెటింగ్‌కు సహకారం కల్పిస్తున్నామని వెల్లడించారు.

యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

రుక్మాపూర్‌లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,000 మందికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జమ్మికుంట, ఆర్మూర్‌లో ప్లగ్ అండ్ ప్లే ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో లిడ్ క్యాప్‌కు కేటాయించిన భూములపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

టిడిపి అభ్యర్థులు కాకినాడ రూరల్ జడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ముమ్మరం. ప్రచారంలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు.





కాకినాడ రూరల్ అక్టోబర్ 26సత్య దీపిక ఉదయం :
అందరివాడు యాదల రమేష్ గంగనాపల్లి -2 ఎమ్.పి.టి.సి. అభ్యర్థిగా మరియు కాకినాడ రూరల్ జెడ్పీటీసీ అభ్యర్థినీగా కర్రి అనంతలక్ష్మీ బరిలో నిలిచినారు. అత్యధిక మెజార్టీతో గెలిపించ ప్రార్థన. కాకినాడ రూరల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు.ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా హాజరైన ఎ. ఎమ్. సి. చైర్మన్ మాసుమేను మంగ గంగయ్య.తో పాటు గా కూటమీ నాయకులు మరియు ప్రజలు,మహిళలు తదితరులు అభ్యర్థులకి మద్దతుగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ శేషగిరి రావు ఇకలేరు

చివరి రోజువరకూ వృత్తిలో తన సేవలను అందిస్తూ తుది శ్వాస విడిచారు



కొత్తపేట, అక్టోబరు 25.(సత్యదీపిక ఉదయం ప్రతినిధి)స్థానిక డాక్టర్ చిన్నం రాజు హాస్పిటల్లో కొంత కాలంనుండి లివర్ ఇన్ఫెక్షన్తో ట్రీట్మెంట్ పొందుతూ వున్నారు. నిరాడంబరుడు. మితవాది వానపల్లి, శ్రీకాకుళం, కొత్తపేట వారి సేవలు అందిందించి. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరెంటెండెంట్ గా రిటైర్డ్ అయ్యి న తరువాత స్థానికి గౌస్ కళ్ళజోళ్ళ షాప్ నందు వారి సర్వీస్ కంటిపరీక్షలు చేసేవారు. కళ్ళజోళ్ళ షాప్ ఓనర్ గౌస్ వారు మృతి చెందడం తీరనిలోటు గా తెలిపారు. వారు అందించిన సేవలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. "వైద్యో నారాయణహరి"ఈ మాట డాక్టర్ శేషగిరికి వర్తిస్తుందని పలువురు గుర్తుచేసుకున్నారు.వారి ఆత్మకు శాంతి కలగాలని పలువురు ప్రముఖులు కోరారు

తాటిపాక ఎంపీటీసీ - 2 అభ్యర్థిగా పోటీలో చిత్రపు అరుణ





రాజోలు, అక్టోబర్ 25 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాజోలు మండలం తాటిపాక ఎంపీటీసీ - 2 అభ్యర్థిగా తాటిపాక గ్రామ వైఎస్సార్సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి సతీమణి చిత్రపు అరుణ పోటీలోనున్నారు. ఈ మేరకు వివరాలలోకి వెళ్ళితే చిత్రపు అరుణ భర్త చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి సూదీర్ఘ కాలంగా రాజకీయాలలో ఉండటంతో పాటుగా తాటిపాక ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ గా పనిచేసిన అనుభవంతో పాటుగా వివాదరహితుడిగా ప్రజల్లో మంచి పేరు ఉండటమనేది చిత్రపు అరుణకు కలిసొచ్చే అంశాలుగా చెప్పవచ్చు. అంతే కాకుండా చిత్రపు అరుణ కుటుంబానికి ప్రజల సమస్యల పట్ల అవగాహనతో పాటుగా వ్యవహారాలను చక్కదిద్దే నేర్పరితనం ఉండటమనేది మరింత బలం చేకూరుతుందని ప్రజలు నుండి అభిప్రాయాలు వెల్లడౌతున్నాయి. ముందు నుండి చిత్రపు అరుణ కుటుంబానికి ప్రజల్లో ఆశించదగిన పేరు ఉండటం విశేషం. తాటిపాక 2 నుండి వైఎస్సార్సీపీ ఎంపీటీసీ పదవికి పోటీపడుతున్న చిత్రపు అరుణకు ఏ మేరకు ప్రజల నుండి మద్దత్తు లభిస్తుందో వేచి చూడాల్సిందే..!

శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా తంటికొండ, గాదెలపాలెం గ్రామాల్లో విస్తృత తనిఖీలు, ఫ్లాగ్ మార్చ్

గోకవరం, అక్టోబర్ 26, (సత్య దీపిక ఉదయం వీలైకరీ): జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, రాబోయే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే ధ్యేయంగా గోకవరం మండల పరిధిలోని తంటికొండ మరియు గాదెలపాలెం గ్రామాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమం కోరుకొండ డిఎస్పీ జీవన ప్రత్యక్ష పర్యవేక్షణలో, సి.ఐ వి.వి.ఎస్.ఎన్. మూర్తి, గోకవరం ఎస్.ఐ పవన్ కుమార్, లేడీ ఎస్.ఐ నాగమణి , మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది సమక్షంలో జరిగింది.

కార్డన్ అండ్ సెర్చ్ 20 బైక్‌ల సీజ్:
తంటికొండ గ్రామంలో ఉదయం నుంచే ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులు చూపి వాహనాలను తీసుకెళ్లాలని యజమానులకు సూచించారు.



ఎన్నికల అవగాహన సమావే
తంటికొండ మరియు గాదెలపాలెం గ్రామ ప్రజలతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజల్లో ధైర్యాన్ని నింపడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి తంటికొండ మరియు గాదెలపాలెం గ్రామాల్లో పోలీస్ అధికారుల బలగాలతో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



ఈ సందర్భంగా డిఎస్పీ జీవన మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను ప్రశాంత వాతావరణంలో అమలు చేయడానికి మరియు అసంఘటిత శక్తులపై నిఘా ఉంచడానికి గ్రామ ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.
ఈ తనిఖీలలో సి.ఐ వి.వి.ఎస్.ఎన్. మూర్తి , ఎస్.ఐ పవన్ కుమార్, లేడీ ఎస్.ఐ నాగమణి మరియు స్టేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముంచుకోస్తున్న ఆర్నబ్ తుఫాన్ పై మండల అధికారులతో సమీక్ష సమావేశం.



ముమ్మిడివరం : అక్టోబర్ 26 సత్య దీపిక ఉదయం రిపోర్టర్.ఆర్నబ్ తుఫాన్ నేపద్యంలో ముమ్మిడివరం మండలం లోని తీసుకోవలసిన చర్యలపై మండల ప్రత్యేక అధికారి సుబ్బరాజు, డిఈ.(పంచాయత్ రాజ్) వారు మండల అధికారులకు తగు ఆదేశములు జారీచేసిఉన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుట , చెట్లు మెదలగు పడిపోయినపుడు తొలగించుట, ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా పూర్తి స్తాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని తెల్పియున్నారు. 27, 28 వ తేదీలలో ప్రజలేవ్వరూ ఇంటి నుండి బయటకు రావద్దని , దూర ప్రయానాల కూడా రద్దు చేసుకోవాలని కొరడమైనది.మండల స్తాయి అధికారులతో పాటు గ్రామ స్తాయి వి.ఆర్.ఓలు మరియు ఇతర శాఖల సిబ్బందితో సమావేశము కూడా ఏర్పాటు చెయ్యడమైనది. ఈ కార్యక్రమములో తహశీల్దార్ టి. సుభాష్, మండల అభివృద్ది అధికారి జె.యల్.యన్.దీక్షితులు డిప్యూటీ తహశీల్దార్ బి గోపాలకృష్ణ మరియు ఇతర మండల శాఖల అధికారులు పాల్గొనడమైనది.

సీమునాపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం



అనకాపల్లి అక్టోబర్ :26(సత్యదీపిక ఉదయం బ్యూరో)
చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీమునాపల్లి గ్రామంలో సీఐ పి అప్పలరాజు ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో భాగంగా రాబోయే ఎంపీటీసీ , జడ్పీటీసీ మరియు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాలు, సంబంధిత చట్టాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా గ్రామంలోని యువత గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు మరియు వాటిపై ఉన్న చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా విద్య, ఉద్యోగం మరియు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ పి. అప్పలరాజుతో పాటు చోడవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ 112 వ వార్డులో కొణతాల రామకృష్ణ విస్తృత ప్రచారం..

కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి.



అనకాపల్లి, అక్టోబర్ 26,(సత్య దీపిక ఉదయం)అనకాపల్లి జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణజీవీఎంసీ 112వ వార్డులో విస్తృత ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. . ఈ సందర్భంగా విజయ రామరాజుపేట వీధులు, పరిసర ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి ఆళ్ల వైష్ణవితో తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకొని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరఫున ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 112 వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ ఆళ్ల రామచంద్ర రావు , తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పోలవరపు త్రినాథ్ గారు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ పదవి మహిళకు రిజర్వ్ కావడంతో.. చైర్మన్ రేసులో రత్నం మహేశ్వరి దేవి..



కడియం అక్టోబర్23(సత్య దీపిక ఉదయం స్టాఫ్ రిపోర్టర్):
తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో, ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో కడియం మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా రత్నం అయ్యప్ప ఆయన సతీమణి రత్నం మహేశ్వరి దేవి విజయవంతంగా నామినేషన్లు దాఖలు చేశారు.
జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కూటమి నాయకత్వం జనసేన పార్టీకి కేటాయించిన పక్షంలో, మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో రత్నం మహేశ్వరి దేవి చైర్మన్ అభ్యర్థిత్వ రేసులో ముందువరుసలో నిలిచే అవకాశం ఉంది. ఒకవేళ చైర్మన్ పదవి జనసేన పార్టీకి కేటాయించని పక్షంలో, రత్నం అయ్యప్ప కడియం జడ్పీటీసీ అభ్యర్థిగా తన పోటీని కొనసాగిస్తారు.అయితే, జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కేటాయింపు, అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం ఎన్డీఏ కూటమి నాయకత్వం తీసుకోనుంది అని రత్నం అయ్యప్ప అన్నారు.

విజయ్‌ను 100 కాదు.. 1000 సార్లు ప్రపోజ్ చేస్తా..



నటి రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ గురించి సోషల్ మీడియాలో ఇటీవల జరుగుతున్న చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా వీరిద్దరూ కలిసి పాల్గొన్న 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో రష్మిక చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీశాయి. విజయ్‌ను పెళ్లి చేసుకోవడానికి తాను అతడికి వందసార్లు ప్రపోజ్ చేసినట్లు ఆమె సరదాగా చెప్పడంతో కొందరు నెటిజన్లు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో రష్మిక సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టి తన అభిప్రాయాలను వెల్లడించారు. తమ బంధం గురించి అసలు విషయం ఏమిటో వివరించే ప్రయత్నం చేశారు.తన గురించి, విజయ్ గురించి ఇంటర్నెట్‌లో జరుగుతున్న చర్చపై రష్మిక స్పందించారు. సాధారణంగా ఇలాంటి విషయాలపై తాను స్పందించనని, ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఇతరుల అభిప్రాయాలను చదివి, విషయాలను మరో కోణంలో అర్థం చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తానని తెలిపారు. అయితే తమ ఇంటర్వ్యూపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ అభిప్రాయాల వ్యక్తీకరణలా కాకుండా, కోపాన్ని వెళ్లగక్కడానికి ఒకరిని లక్ష్యంగా చేసుకున్నట్లుగా అనిపిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం పక్కదారి పట్టిందని, తమ మాటలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విజయ్‌కు వందసార్లు ప్రపోజ్ చేశానన్న వ్యాఖ్యపై వస్తున్న విమర్శలకు రష్మిక తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తీసుకున్నామన్నది ముఖ్యమైన విషయం కాదని స్పష్టం చేశారు.

సినిమా న్యూస్

నా బ్రెయిన్ వాడలేదు..

సీత పాత్రపై సాయిపల్లవి ఇంట్రెస్టింగ్ కామెంట్స్



డ్యాన్సర్‌గా, నటిగా తమిళం, మలయాళంతోపాటు తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది సాయిపల్లవి. డైరెక్టర్ ఇచ్చిన పాత్రకు ప్రాణం పోయాలంటే సాయిపల్లవి తర్వాతే ఎవరైనా అని అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఓ వైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే.. మరోవైపు నటనకు ఆస్కారమున్న సినిమాలు చేసే సాయిపల్లవి ప్రస్తుతం బాలీవుడ్ మాగ్నమ్ ఓపస్ ప్రాజెక్టు రామాయణలో సీతగా నటిస్తుందని తెలిసిందే.దర్శకుడు ఇచ్చిన ఏ రోల్ అయినా సరే తన మార్క్ యాక్టింగ్ ఉండేలా చూసుకుంటుంది సాయిపల్లవి. ఈ బ్యూటీ బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న కౌన్ బనేగా కరోర్‌పతి షోలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాను రెగ్యులర్‌గా పోషించే పాత్రల కంటే భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న సీత పాత్రను పోషించే అవకాశం రావడం గొప్ప బాధ్యత అని చెప్పింది సాయిపల్లవి.

'నేను పోషించిన ప్రతీ పాత్రకు నా వెర్షన్‌తోపాటు ఇన్‌పుట్స్ ఇచ్చేదాన్ని. కానీ సీత పాత్ర పోషిస్తున్న సమయంలో అంతటి పవిత్రమైన వ్యక్తిత్వం కలిగిన పాత్ర నుంచి నేనేం పొందగలనో అనే దాని గురించి మాత్రమే ఆలోచించాను. నేను నా బుర్రను (మెదడు) అస్సలు ఉపయోగించలేదు. నేను కేవలం సీతమ్మ ఆశీర్వాదాలు తీసుకొని ఆమె పాత్రను ఆకళింపు చేసుకున్నా'నంటూ చెప్పుకొచ్చింది. కౌన్ బనేగా కరోర్‌పతి షోలో సాయిపల్లవి చేసిన ఈ కామెంట్స్ సీతాదేవి పట్ల ఆమెకున్న గౌరవాన్ని చెప్పకనే చెబుతూనే.. మరోవైపు బిగ్ బీని ఇంప్రెస్ చేశాయి.

బ్లాస్ట్ సినిమాతో ఎలాంటి కనెక్షన్ లేదు..

యాక్షన్ హీరో అర్జున్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం బ్లాస్ట్ . తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తోన్న మూవీ ఆదర్శకుటుంబం. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే బ్లాస్ట్, ఆదర్శకుటుంబం ఒకే పంథాలో సాగుతాయని.. రెండు సినిమాల స్టోరీలైన్ ఒకటే అంటూ కొన్నాళ్లుగా నెట్టింట పుకార్లు రౌండప్ చేస్తున్నాయి.

గాసిప్స్‌పై ఆదర్శకుటుంబం హీరోయిన్ శ్రీనిధి శెట్టి క్లారిటీ ఇచ్చింది. 'నేను బ్లాస్ట్ సినిమా చూశాను. ఆదర్శకుటుంబం, బ్లాస్ట్ చిత్రానికి ఎలాంటి కనెక్షన్ ఉండదు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ ఒకేలా ఉన్నాయని అనిపించడం సాధారణంగా జరిగేదేనంటూ' చెప్పుకొచ్చింది. శ్రీనిధి శెట్టి కామెంట్స్‌తో పుకార్లకు పుల్‌స్టాప్ పడింది.

ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. దేవ్‌యానీ శర్మ, యువినా పార్థవి, నివేదా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేశ్, రాజా ప్రజ్వల్, బ్రహ్మాజీ, రఘుబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 30న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.





ఈ వారం ఓటీటీలోకి కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు.. 'తెల్లకాగితం' నుంచి ' ఎస్సై యుగంధర్' వరకు ఫుల్ లిస్ట్ ఇదే..!

సినిమా అభిమానులకు ఈ వారం థియేటర్లతో పాటు ఓటీటీల్లోనూ వినోదం అందనుంది. అక్టోబర్ చివరి వారంలో వెంకటేశ్--త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం'తో పాటు విశ్వక్ సేన్ 'కల్ట్', 'కిల్లర్', 'చంద్రయాన్' వంటి సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి. మరోవైపు ఓటీటీల్లో ప్రేమకథలు, హారర్, క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్లతో పాటు పలు వెబ్‌సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నాయి. అక్టోబర్ 26 నుంచి 30 వరకు ఏయే సినిమాలు, సిరీస్‌లు ఏయే వేదికల్లో అందుబాటులోకి రానున్నాయో తెలుసుకుందాం.

ఈ వారం ప్రత్యేకంగా రానున్న తెలుగు సినిమాలు

1. తెల్లకాగితం

'కోర్ట్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న హర్ష్ రోషన్, నక్షత్ర ప్రధాన పాత్రల్లో నటించిన ప్రేమకథా చిత్రం 'తెల్లకాగితం'. రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా థియేటర్లలో మిశ్రమ స్పందనను సొంతం చేసుకుంది. ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈటీవీ విన్‌లో అక్టోబర్ 29 నుండి ఈ మూవీ స్ట్రీమ్ కానుంది.

2. ఎస్సై యుగంధర్

యువ కథానాయకుడు ఆది సాయికుమార్ నటించిన క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఎస్సై యుగంధర్'. రాఘవేంద్ర కటారి దర్శకత్వం వహించిన ఈ చిత్రం పోలీసు విచారణ, నేరాల చుట్టూ సాగే కథాంశంతో రూపొందింది. నెట్‌ఫ్లిక్స్ లో అక్టోబర్ 30 నుండి స్ట్రీమ్ కానుంది.

3. ఇమ్మోర్టల్

సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్, కయాదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'. ప్రేమ, భయం, ఉత్కంఠ కలగలిసిన ఈ చిత్రం పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సోనీ లివ్‌లో అక్టోబర్ 30 నుండి తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషలలో స్ట్రీమ్ కానుంది.

విశ్వక్ సేన్ ఫ్యాన్స్ మీట్‌లో గందరగోళం.. అభిమానులకు



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'కల్ట్' విడుదలకు ముందే వార్తల్లో నిలుస్తోంది. అయితే ఈసారి సినిమా కారణంగా కాకుండా, అభిమానుల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్స్ మీట్ అర్ధాంతరంగా రద్దు కావడంతో చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో ఆదివారం విశ్వక్ సేన్‌తో ఫొటోలు దిగేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంచనాలకు మించి అభిమానులు తరలిరావడంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఏర్పడటంతో నిర్వాహకులు ఫ్యాన్స్ మీట్‌ను మధ్యలోనే నిలిపివేశారు.విశ్వక్ సేన్‌ను నేరుగా కలుసుకుని ఫొటోలు దిగాలనే ఉత్సాహంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు సారథి స్టూడియోకు చేరుకున్నారు. అయితే వచ్చిన జనసందోహానికి తగిన స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంతో ప్రాంగణంలో రద్దీ పెరిగింది. తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తొక్కిసలాట జరిగే ప్రమాదాన్ని గుర్తించిన నిర్వాహకులు కార్యక్రమాన్ని అర్ధాంతరంగా రద్దు చేసారు. ఎంతో ఆశతో వచ్చిన అభిమానులు తమ అభిమాన హీరోతో ఫొటో దిగే అవకాశం దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు. కొందరు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ ఏర్పాటు చేసిన ప్రచార ప్లెక్సీలు, బ్యానర్లను తొలగించి నిరసన తెలిపారు. ఈ ఘటనతో 'కల్ట్' చిత్ర బృందం నిర్వహణపై విమర్శలు మొదలయ్యాయి. .ద్వారా క్షమాపణలు చెప్పారు. అభిమానుల నుంచి వచ్చిన ప్రేమాభిమానాలు తమ అంచనాలకు మించి ఉన్నాయని, అందరినీ కలవాలని తాను ఎంతో కోరుకున్నప్పటికీ తగిన ఏర్పాట్లు లేక ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగడం సాధ్యం కాలేదని పేర్కొన్నారు.

PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

ముంచుకోస్తున్న ఆర్నబ్ తుఫాన్ పై మండల అధికారులతో సమీక్ష సమావేశం.

ముమ్మిడివరం,అక్టోబర్ 26 సత్య దీపిక ఉదయం

రిపోర్టర్.ఆర్నబ్ తుఫాన్ నేపద్యంలో ముమ్మిడివరం మండలం లోని తీసుకోవలసిన చర్యలపై మండల ప్రత్యేక అధికారి సుబ్బరాజు, డిఈ.(పంచాయత్ రాజ్) వారు మండల



అధికారులకు తగు ఆదేశములు జారీచేసిఉన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుట , చెట్లు మెదలగు పడిపోయినపుడు తొలగించుట, ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా పూర్తి స్తాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని తెల్పియున్నారు. 27, 28 వ తేదీలలో ప్రజలేవ్వరూ ఇంటి నుండి బయటకు రావద్దని , దూర ప్రయానాల కూడా రద్దు చేసుకోవాలని కొరడమైనది.మండల స్తాయి అధికారులతో పాటు గ్రామ స్తాయి వి.ఆర్.ఓలు మరియు ఇతర శాఖల సిబ్బందితో సమావేశము కూడా ఏర్పాటు చెయ్యడమైనది. ఈ కార్యక్రమములో తహశీల్దార్ టి. సుభాష్, మండల అభివృద్ధి అధికారి జె.యల్.యన్.దీక్షితులు డిప్యూటీ తహశీల్దార్ బి గోపాలకృష్ణ మరియు ఇతర మండల శాఖల అధికారులు పాల్గొనడమైనది.

డాక్టర్ శేషగిరి రావు ఇకలేరు

- చివరి రోజువరకూ వృత్తిలో తన సేవలను అందిస్తూ తుది శ్వాస విడిచారు

కొత్తపేట, అక్టోబరు 25.(సత్యదీపిక ఉదయం ప్రతినిధి)



స్థానిక డాక్టర్ చిన్నం రాజు హాస్పిటల్లో కొంత కాలంనుండి లివర్ ఇన్ఫెక్షన్తో ట్రీట్మెంట్ పొందుతూ వున్నారు. నిరాడంబరుడు. మితవాది వానపల్లి, శ్రీకాకుళం, కొత్తపేట వారి సేవలు అందిందించి. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరెంటెండెంట్ గా రిటైర్డ్ అయ్యి న తరువాత స్థానికి గౌస్ కళ్ళజోళ్ళ షాప్ నందు వారి సర్వీస్ కంటి పరీక్షలు చేసేవారు. కళ్ళజోళ్ళ షాప్ ఓనర్ గౌస్ వారు మృతి చెందడం తీరనిలోటు గా తెలిపారు. వారు అందించిన సేవలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. "వైద్యో నారాయణహరి"ఈ మాట డాక్టర్ శేషగిరికి వర్తిస్తుందని గౌస్ శుక్రవారం రాత్రి ఎనిమిది మందికి కంటి పరీక్షలు చేసారని తెలిపారు పలువురు వీరి సేవలు గుర్తుచేసుకున్నారు.వారి ఆత్మకు శాంతి కలగాలని పలువురు ప్రముఖులు కోరారు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మూడు రోజులపాటు సరిపడా నిత్యావసర వస్తువులను సిద్ధం చేసుకోవాలి: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస, అక్టోబర్ 26 (సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్):

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పలాస నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. రానున్న రెండు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ఉద్దానం ప్రాంత రైతులు, తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు. కనీసం మూడు రోజులపాటు సరిపడా ఆహార పదార్థాలు, తాగునీరు, మందులు, ఇతర నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఇబ్బందులు తలెత్తకుండా టార్చ్‌లైట్లు, అదనపు బ్యాటరీలు, పవర్‌బ్యాంకులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఉద్దానం ప్రాంతంలోని కొబ్బరి, జీడి రైతులు తమ పంటలు, వ్యవసాయ ఉత్పత్తుల రక్షణకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా సంబంధిత అధికారులు జారీ చేసే హెచ్చరికలు, ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తీర ప్రాంత ప్రజలు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారులు సూచించే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటారని అప్పలరాజు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు.

22వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం.. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి
- సూదికొండలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ.. ఓటర్లను అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పలాసబ్యూరో శంకర్,సత్యదీపిక ఉదయం



పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని 22వ వార్డు సూదికొండ ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఫ్యాన్ గుర్తుపై పోటీ చేస్తున్న వజ్జల సౌజన్య క్రిష్ణను, పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఫ్యాన్ గుర్తుపై బరిలో ఉన్న తాలాసు పద్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. వార్డు అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని ప్రచారంలో భాగంగా ఓటర్లకు వివరించారు. వార్డులో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చొరవ చూపడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డు అభివృద్ధి జరగాలంటే తమ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ అభ్యర్థుల గురించి వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, వారి సమస్యలు, అవసరాలపై చర్చిస్తూ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయం సాధించి, వార్డు అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ప్రచారాన్ని కొనసాగిస్తున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస--కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు గోపి శిస్టుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కౌన్సిలర్ అభ్యర్థి వజ్జల సౌజన్య క్రిష్ణ, చైర్‌పర్సన్ అభ్యర్థి తాలాసు పద్మలను గెలిపించాలని 22వ వార్డు ఓటర్లను కోరారు.

కార్డన్ అండ్ సెర్చ్ విస్తృత తనిఖీలు, ఫ్లాగ్ మార్చ్

- 20 బైక్‌ల సీజ్

గోకవరం, అక్టోబర్ 26, సత్య దీపిక ఉదయం :

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, రాబోయే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే ధ్యేయంగా గోకవరం మండల పరిధిలోని తంటికొండ మరియు గాదెలపాలెం గ్రామాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కోరుకొండ డిఎస్పీ జీవన ప్రత్యక్ష పర్యవేక్షణలో, సి.ఐ వి.వి.ఎస్.ఎన్. మూర్తి, గోకవరం ఎస్.ఐ పవన్ కుమార్, లేడీ ఎస్.ఐ నాగమణి , మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది సమక్షంలో జరిగింది.తంటికొండ గ్రామంలో ఉదయం నుంచే ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులు చూపి వాహనాలను తీసుకెళ్లాలని



యజమానులకు సూచించారు.
ఎన్నికల అవగాహన సమావేతంటికొండ మరియు గాదెలపాలెం గ్రామ ప్రజలతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజల్లో ధైర్యాన్ని నింపడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి తంటికొండ మరియు గాదెలపాలెం గ్రామాల్లో పోలీస్ అధికారుల బలగాలతో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ జీవన మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను ప్రశాంత వాతావరణంలో అమలు చేయడానికి మరియు అసంఘటిత శక్తులపై నిఘా ఉంచడానికి గ్రామ ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈతనిఖీలలో సి.ఐవి.వి.ఎస్.ఎన్.మూర్తి , ఎస్.ఐ పవన్ కుమార్, ఎస్.ఐ నాగమణి మరియు స్టేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

- ప్రశాంత ఎన్నికలకు పోలీసులకు సహకరించాలి.. సోషల్ మీడియా పోస్టులపై నిఘా
- డీజే వినియోగానికి అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

పలాస,సత్యదీపిక ఉదయం బ్యూరో :



పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలి

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తమ రాజకీయ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించే సేవలు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించవచ్చని పోలీసులు తెలిపారు. అయితే రాజకీయ విమర్శల పేరుతో ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలపై దూషణలకు దిగడం, అసభ్యకర పదజాలం ఉపయోగించడం, కులాలు, మతాలు, వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా

ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే సందేశాలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలను ప్రచారం చేయకూడదని స్పష్టం చేశారు. పోస్టులు చేయడం మాత్రమే కాకుండా, ఇతరులు పంపిన అభ్యంతరకర సమాచారాన్ని షేర్ చేయడం, కామెంట్లు చేయడం వంటి చర్యల విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే అందుబాటులో ఉన్న ఆధారాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లదీ బాధ్యతే

రాజకీయ పార్టీలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల గ్రూపుల నిర్వాహకులు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని పోలీసులు కోరారు. గ్రూపుల్లో విద్వేషపూరిత సందేశాలు, అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, ఘర్షణలకు దారితీసే పోస్టులు ప్రచారం కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. అభ్యర్థులు సైతం తమ అనుచరులు, అభిమానులు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని తెలిపారు.

ర్యాలీలు, సభలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించదలచిన వారు సంబంధిత నిబంధనలను పాటిస్తూ ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలు, ఊరేగింపులు, ఇతర కార్యక్రమాల్లో డీజే వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని పార్టీల పట్ల సమాన వైఖరి



ఎన్నికల నిర్వహణలో పోలీసులు ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల పట్ల సమాన వైఖరితో వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలుతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలిఎన్నికల ప్రచార సమయంలో ఎక్కడైనా గొడవలు, ఘర్షణలు, బెదిరింపులు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఎదురైతే వ్యక్తిగతంగా తలపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పుకార్లను నమ్మవద్దని, ధృవీకరించని సమాచారాన్ని ఇతరులకు పంపవద్దని కోరారు.పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా గ్రూపుల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరస్పర గౌరవంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అందరూ సంయమనం పాటించాలని పోలీసులు పిలుపునిచ్చారు.

కానిస్టేబుల్ పైలా మోహన్ కుటుంబానికి 2009 బ్యాచ్ పోలీసుల అండ

- రూ.2.88 లక్షల ఆర్థిక సాయం అందజేత

అనకాపల్లి అక్టోబర్ :26(సత్యదీపిక ఉదయం బ్యూరో)

దేవరపల్లి మండలనికి చెందిన పైలా మోహన్ విధుల నిర్వహణలో నిబద్ధతతో ఉంటూ, ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన తోటి కానిస్టేబుల్ పైలా మోహన్



కుటుంబాన్ని ఆదుకునేందుకు 2009 బ్యాచ్ పోలీసు సిబ్బంది మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా (ప్రస్తుత అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు) 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ సేకరించిన రూ.2,88,000/- ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్బి) విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పైలా మోహన్ (స్వగ్రామం: దేవరపల్లి మండలం, కొత్తపెంట) గత బుధవారం (14.10.2026) ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య భవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు.మోహన్ దశదిన కర్మ సందర్భంగా కొత్తపెంట గ్రామంలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో 2009 బ్యాచ్ పోలీసు సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యాచ్‌కు చెందిన 191 మంది సిబ్బంది సమకూర్చిన రూ.2,88,000/- నగదును మోహన్ భార్య పైలా భవాని, వారి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది మాట్లాడుతూ. తోటి మిత్రుడిని కోల్పోవడం తమ బ్యాచ్‌కే కాకుండా శాఖకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ చురుగ్గా, స్నేహభావంతో ఉండే మోహన్ ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మోహన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని, పిల్లల భవిష్యత్తుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా పరిధిలోని 2009 బ్యాచ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, గ్రామ ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీమునాపల్లి గ్రామంలో
పల్లెనిద్ర కార్యక్రమం

అనకాపల్లి అక్టోబర్ :26(సత్యదీపిక ఉదయం బ్యూరో)

చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీమునాపల్లి గ్రామంలో సీఐ పి అప్పలరాజు ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా రాబోయే ఎంపీటీసీ , జడ్పీటీసీ మరియు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా ప్రజలు శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు



అవగాహన కల్పించారు.అలాగే మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాలు, సంబంధిత చట్టాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా గ్రామంలోని యువత గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు మరియు వాటిపై ఉన్న చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా విద్య, ఉద్యోగం మరియు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ పి. అప్పలరాజుతో పాటు చోడవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని జగన్ కుట్రలు

- ప్రజాస్వామ్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ ఎన్నికలు...- జగన్ హయాంలో అన్ని బలవంతపు ఏకగ్రీవాలే - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

కొత్తపేట, అక్టోబర్ 26.

(సత్య దీపిక ఉదయం ప్రతినిధి)



స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని జగన్ కుట్రలు పన్నుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ కు తెలుసిందంతా కూడా శవరాజకీయాలే రాజకీయలే. విలువలు తెలియదు దౌర్జన్యాలు అక్రమాలు దాడులు ఇవే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యొక్క రాజకీయ అస్త్రాలు. మరి ఈనాడు ప్రజాస్వామ్యయుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబడుతూ ఉంటే ఆ ఎన్నికలు అడ్డుకోవడానికి వైఎస్సార్సీపీ నాయకులు తీవ్రమైన కుట్రలు పన్నుతూ, అనేక నాటకాలకు తెరలేపుతున్నారు. ఆఖరికి వాళ్ల నామినేషన్ పత్రాలను వాళ్లే చించేసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షించాల్సిన పోలీసుల మీద కూడా దాడులు చేస్తున్నారు. మరి వారి తీరు చూస్తా ఉంటే ఒక దండుపాల్యం ముఠాలా కనపడతా ఉంది. ఆనాడు వైసీపీ ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించాడనేది ప్రజలు మర్చిపోయారేమో అని అనుకుంటున్నారు. ఆనాడు ఏ విధంగా బరువంతపు ఆక్రమాలు జరిగాయి, దౌర్జన్యాలు జరిగాయి, దాడులు జరిగాయి, హింస జరిగిందనేది రాష్ట్ర చరిత్రలో ఏనాడూ కూడా స్థానిక ఎన్నికల వేళ అటువంటి దుర్మార్గాలు జరగడం ఎవరు చూడలేదు. మరి ఈనాడు ఎంతో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఒకపక్క ఈ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలని చంద్రబాబు నాయుడు కృషి చేస్తే ఉంటే ఈ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలనే ఆలోచనతోటే జగన్ మోహన్ రెడ్డి ఉండటం దురదృష్టకరం. ఏ నాయకుడికైనా ఎవరికైనా రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధ ఉండాలి. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు బాగుండాలని కోరుకోవాలి. చంద్రబాబునాయుడు పాలన ప్రజలందరూ కూడా హర్షిస్తూ, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఏ విధ విధంగా ఇబ్బందులు పాలు చేయాలి బురద చల్లాలి అని స్థానిక ఎన్నికల అడ్డం పెట్టుకొని అనేక రకాలుగా సమస్యలు సృష్టిస్తూ ఉన్నారు. మరి శాంతి భద్రతల గురించి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతున్నారంటే చాలా విడ్డూరంగా ఉంది. అసలు ఆనాడు వైసీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు ఉన్నాయా? కక్షలు, వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు. శనివారం వచ్చిందని తప్ప, ఆదివారం వచ్చిందని తప్ప ఎక్కడ ఎవరి ఇల్లు, ఏది కూల్చేస్తారో తెలియనటువంటి పరిస్థితి ఆనాడు మనం చూశాం. అక్రమ అరెస్టులు చూశాం. అలాగే వైసీపీ పార్టీ గొడ్డలి పార్టీ అంటున్నాం ఇప్పుడు, ఎందుకంటే ఆ పార్టీ యొక్క జరిగినన్ని సంఘటనలు చూస్తా ఉంటే. ఒక క్రిమినల్స్ ని తయారు చేసే ఫ్యాక్టరీలా తయారైంది వైసీపీ పార్టీ. మరి ఏకగ్రీవాల గురించి గతంలో పొంగనూరులో ఏం జరిగింది? రాయచోటిలో ఏం జరిగింది? పులివెందులలో ఏం జరిగింది? మర్చిపోయారా మీరు? ఆనాడు ఏ విధంగా మీరు వ్యవహరించారు? ఆ రాజకీయాలు ఏ విధంగా చేశారు? ఇప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకి అన్యాయం చేయడానికి, బీసీ వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు కాకుండా ఉండడానికి లేదా రాష్ట్రానికి వస్తున్నటువంటి నిధులు రాకుండా అడ్డుకోవడానికి పన్నెండు వేల ఆరు వందల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోతే ఆ నిధులు రాకుండా చేయాలనే దురుద్దేశంతోటి బీసీ వర్గాల వారికి రిజర్వేషన్లు అందుకోకుండా 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా ఉండడం కోసం ఎన్ని కేసులు వేశారు. యాభై తొమ్మిది కేసులు మీరు కోర్టులో వేశారే వాటన్నింటినీ కూడా అధిగమించి బీసీలకి 34 శాతం ఇస్తున్నాం. రిజర్వేషన్ల కంటే కచ్చితంగా ఇంకా రిజర్వేషన్లు కల్పిస్తూ ఈనాడు ఎన్డీఏ కోటమి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడుతూ ఉంటే మీరు రకరకాలుగా మాట్లాడుతున్నారు. మీ గురించి ప్రజలకు చెప్పక్కర్లేదు, మీ తల్లిని అడిగితే చెప్తారు. మీ సొంత చెల్లిని అడిగితే చెప్తారు. మీరు ఏమిటనేది. వాళ్ళు వేధించి ఏ విధంగా మీరు మానసిక ఆనందం పొందుతూ ఉన్నారనేది ఈ మధ్యనే మేనకోడలు పెళ్లి చేసుకుంటానంటే కూడా మేనకోడలు పెళ్లి కూడా మీ యొక్క ఎలవంక పాలెస్ కోసం ఏ విధంగా వ్యవహరించారో ప్రజలు గమనిస్తున్నారు. ఎవరైనా గాని తండ్రి తర్వాత తండ్రిలా భావిస్తారు మేనమామని మరి ఈ మేనమామ, మేనకోడలు పెళ్లికి అడ్డుపడి ఒక కంసమామలా తయారయ్యాడనేది ఈనాడు మనం చూస్తా ఉన్నాం. శాంతి భద్రతల సమస్య చెప్తున్నారు మీరు. తాడేపల్లి పాలెస్ లో ఆనాడు శాంతి భద్రతల సమస్య కనపడలేదా? ఈనాడు ఎలహంకా పాలెస్ మీ ప్యాలెస్లో మీ సొంత మేనకోడలు పెళ్లికి కూడా మీరు సహకరించకుండా దుర్మార్గంగా వ్యవహరించడం మీ యొక్క నీచ వైఖరిని తెలియజేస్తా ఉంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో మీరు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఏకగ్రీవాలు జరిగితే వైసీపీ నుండి టిక్కెట్లు ఇవ్వనన్నారు. మరి మీకు ఈనాడు పులివెందులలో ఇరవై వార్డుల ఏకగ్రీవమయ్యాయి. మీ జిల్లాలోనే ఒక ఆరు మున్సిపాలిటీలు ఏకగ్రీవమయ్యాయి. మీరు పులివెందుల నుంచి తప్పుకుంటారా అని నేను ప్రశ్నిస్తా ఉన్నాను. అంటే మరి పులివెందులలో ఇరవై వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మీ జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఏకగ్రీవమయ్యాయి. మరి మీరు చెప్పిన మాటే కదా, మీ వైసీపీ నాయకులు ఎవ్వరికి ఏకగ్రీవమైనా టికెట్లు ఇవ్వనన్నారు. అయితే మీ పులివెందుల కూడా మీరు తప్పుకోవాలి.. డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రం, రాష్ట్రం. ఈనాడు రెండు ప్రభుత్వాలు ప్రజల కోసం, రాష్ట్రం కోసం కృషి చేస్తా ఉన్నాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ వారితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారాలతో మహానాయకులు అందరూ కూడా రాష్ట్ర అభివృద్ధికి ఈ రెండు సంవత్సరాల మూడు నాలుగు నెలల కాలంలోనే అనేక రకాలుగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతా ఉంది. ప్రజలు పూర్తి సంతృప్తిలో ఉన్నారు. రేపు స్థానిక సంస్థల్లో కూడా జిల్లా పరిషత్ అయినా మండలం అయినా పంచాయతీ అయినా అందరూ కూడా కూటమి నుంచి ప్రజా ప్రతినిధులుగా రావాలి. ఈ డబుల్ ఇంజన్ సర్కార్, త్రిబుల్ ఇంజన్ సర్కార్ అవ్వాలి. అందరూ కూడా కలిసికట్టుగా ఢిల్లీ నుంచి గల్లీ వరకు పంచాయతీ వార్డు మెంబర్ నుంచి ప్రధానమంత్రి వరకు కూడా ఒకే దారిలో ప్రజాస్వామ్యయుతంగా ప్రజల కోసం, అభివృద్ధి కోసం ఈ రాష్ట్రాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం ఈనాడు చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి బాసటగా, స్థానిక సంస్థల ప్రతినిధులను కూడా ప్రజలు గెలిపించడానికి వారిని ఎంపిక చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ఈనాడు సగర్వంగా తెలియజేస్తున్నాని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

జడ్పీటిసి,ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు.

కాకినాడ రూరల్ అక్టోబర్ 26 న్యూస్ :

అందరివాడు యాదల రమేష్ గంగనాపల్లి -2 ఎమ్.పి.టి.సి. అభ్యర్థిగా మరియు కాకినాడ రూరల్ జెడ్పీటీసీ అభ్యర్థినీగా కర్రి



అదిలక్ష్మి బరిలో నిలిచినారు. అత్యధిక మెజార్టీతో గెలిపించ ప్రార్థన. కాకినాడ రూరల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు.ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా హాజరైన ఎ. ఎమ్. సి. చైర్మన్ మాసుమేను మంగ గంగయ్య.తో పాటు గా కూటమీ నాయకులు మరియు ప్రజలు,మహిళలు తదితరులు అభ్యర్థులకి మద్దతుగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండవ విడత సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్.మల్లికార్జునరావు

కడియం ,అక్టోబర్26,(సత్య దీపిక ఉదయం :

కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెండవ విడత సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.



ఈకార్యక్రమంకడియం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగినది.ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా,బాధ్యతాయుతంగా నిర్వహించడంతో పాటు,ఎన్నికల నియమనిబంధనలను తప్పనిసరిగాపాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె. రమేష్, ఎం. శ్రీనివాస్ ఎమ్మార్వో,ఎంఈఓవై. నాగేశ్వరరావు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ లో

స్థానిక సంస్థల ఎన్నికలను.. ప్రశాంత ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అందరు సహకరించాలి...దక్షిణ మండలం డీఎస్పీ

కడియం ప్రతినిధి, అక్టోబర్25,సత్య దీపిక ఉదయం :

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా,



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే ఉద్దేశంతో తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వులు ప్రకారం దక్షిణ మండలం డీఎస్పీ ఎ శివ ప్రియ ఆధ్వర్యంలో కడియం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి గణేష్, కడియం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి దుర్గాప్రసాద్, పిడిఎల్ ప్రసన్న , టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, దక్షిణ మండల సిబ్బందితో కలిసి కడియం మండలంలో చైతన్య నగర్ లో ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్, పేస్ ట్రాకర్, ఫింగర్ ప్రింట్ డివైసెస్ ద్వారా నిర్వహించిన కార్డెన్ సెర్చ్ లో భాగంగా చైతన్య నగర్ లో ఉన్న సస్పెక్ట్స్ ఇతర ట్రబుల్ మాంగర్స్ చెక్ చేసి ఎటువంటి రికార్డ్ లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరుచుకున్నాము. అలాగే వివిధ గ్రామాల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

ఈ సర్వేలో మూడు గ్రామాల సరిహద్దుల నిర్ధారణ

పెంచికల్‌పేట్, సత్యదీపిక ఉదయం :

పెంచికల్‌పేట్ మండలంలో భూ రికార్డుల రీ సర్వేలో భాగంగా పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, ఎల్లూరు గ్రామాల మధ్య సరిహద్దు హద్దులను అధికారులు నిర్ధారించారు. తహసీల్దార్ బోడ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల సరిహద్దులను పరిశీలించి హద్దులను గుర్తించారు. కార్యక్రమంలో జీపీఓలు అనిల్, షారుఖ్, సర్పంచులు భక్తు రాంచందర్, చప్పిడి రవీందర్, షేక్ ఉస్మాన్, సర్వేయర్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

పెంచికల్‌పేట్, సత్యదీపిక ఉదయం :

పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో గాజుల శ్రీనివాస్ తెలిపారు. వీటిలో మూడు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవి కాగా, మరొకటి ఉపాధ్యాయుల సమస్యపై అందినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వీస్ ఈనామ్ బాధితుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

- నేను సర్వీస్ ఈనామ్ బాధితురాలినే

- సీఎం చంద్రబాబును పరిష్కరించమని కోరతా

- జగ్గయ్యపేట చైర్ పర్సన్ కూటమి అభ్యర్థి నరేంద్రుల వినీత

జగ్గయ్యపేట,సత్యదీపిక ఉదయం :

జగ్గయ్యపేట సర్వీస్ ఇనాం భూ బాధితుల సమస్యను పరిష్కరించమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కొరతానని జగ్గయ్యపేట చైర్ పర్సన్ కూటమి అభ్యర్థి నరేంద్రుల వినీత చెప్పారు. ఆదివారం రాత్రి పురపాలక సంఘ పరిధిలోని ఒకటో వార్డు సిద్ధార్థ నగర్ వెంకట సాయి టవర్స్ లో గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ ధూళిపాళ లక్ష్మణరావు ఆధ్వర్యంలో వార్డు ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు,1-36 వ వార్డుల తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు పొన్నూరు అన్వేష్, చావా సునీతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1-36 వార్డులకు చెందిన సర్వీస్ ఈనాం భూ బాధితులు పదేళ్లుగా తాము పడుతున్న సమస్యను ఏ కరవు పెట్టి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, తమ మద్దతు తప్పనిసరిగా ఇస్తామని



చెప్పారు.బాధితుల విజ్ఞప్తిపై ఆమె స్పందిస్తూ తాను కూడా సర్వీస్ ఈనామ్ బాధితురాలినేనని వ్యక్తిగతంగా తాను బాధపడుతున్నానని చెప్పారు. సర్వీస్ ఇనాం బాధితుల ఆకుపచ్చ కండువా అని కప్పుకొని సంఘీభావం తెలిపారు.ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఇతర పెద్దలను కలుపుకొని సమస్యను ప పరిష్కరించమని, తన ఎన్నికల ప్రచారంలో వచ్చిన విజ్ఞప్తిని కూడా సీఎం చంద్రబాబుకు తెలియజేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ఇప్పటికే సమస్య పరిష్కారానికి కసరత్తు జరుగుతుందని స్థానిక ఎన్నికలు ముగిశాక మరోసారి చంద్రబాబును కలిసి సర్వీస్ ఇనాం సమస్యను పరిష్కరించమని కోరతానని చెప్పారుమాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు మాట్లాడుతూ తన కుమార్తెకు ప్రజలు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఉన్నత విద్యావంతురాలు, సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని చెప్పారు.

మహిళా సంఘ భవనం డ్రైనేజీ సాఫిట్ లకు శంకుస్థాపన

లోకేశ్వరం సత్య దీపిక ఉదయం :

లోకేశ్వరం మండలం మన్మద్ గ్రామంలో సోమవారం సర్పంచ్ బాయమొల్ల లలిత భోజన్న ఉపాధి పథకం కింద మహిళ సమైక్య సంఘ భవనం,డ్రైనేజీ సాఫీట్(మురికి కాలువల ఇంకుడు గుంత)ల నిర్మాణాలకు ముగ్గు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు సొంత భవనాల నిర్మాణం శుభ సూచకమని,పరస్పరం చర్చించుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.ఏపీవో అనిల్ మురికి కాలువల ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల నీరు వృధాగా భూమిలోకి ఇంకిపోకుండా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో టిఏ.శారద,వివో అధ్యక్షులు లక్ష్మవ్వ,విఓఏలు సంగీత,సాయన్న,మల్లేష్,వార్డు సభ్యులు సాయన్న,భోజన్న,ఎల్లన్న,,గ్రామస్తులు,తదితరులు ఉన్నారు.



మందమర్రి ఏరియాలో ఘనంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రారంభం

- నిజాయితీ, పారదర్శకతతోనే సంస్థ అభివృద్ధి - ఇంచార్జ్ జీఎం జి.ఎల్. ప్రసాద్

బెల్లంపల్లి, అక్టోబర్ 26, సత్య దీపిక ఉదయం:

సింగరేణి సంస్థలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రతి ఉద్యోగి నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని మందమర్రి ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ జి.ఎల్. ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వారోత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. ఈఈసందర్భంగా జి.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు 'నిజాయితీతో సమృద్ధి' అనే ప్రధాన నినాదంతో మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, అధికారులు అవినీతి నిరోధక చర్యలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ తొలి హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. దేశ అభివృద్ధికి, ప్రభుత్వ రంగ సంస్థల పురోగతికి నిజాయితీతో కూడిన పాలన,



పారదర్శకమైన విధానాలు ఎంతో అవసరమని వివరించారు. ఏ సంస్థలోనైనా లక్ష్యాలు ఎంత ఉన్నతంగా ఉన్నా, ప్రణాళికలు ఎంత పకడ్బందీగా రూపొందించినా వాటి అమలులో అవినీతి, అక్రమాలు, అవకతవకలు, అధికార దుర్వినియోగం చోటుచేసుకుంటే ఆశించిన ఫలితాలు సాధించలేమని ఆయన అన్నారు. ఇలాంటి పరిణామాలు సంస్థ అభివృద్ధికి ఆటంకంగా మారడమే కాకుండా, ఉద్యోగుల్లో నైతిక విలువలను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. అవినీతి కారణంగా సంస్థ ప్రతిష్ఠకు భంగం కలగడంతో పాటు, వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం కూడా సన్నగిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి, అధికారి తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, నిర్ణయాలు తీసుకునే సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సంస్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనం ప్రతి ఉద్యోగి పని విధానంలో భాగం కావాలని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో అవినీతి, అక్రమాలు, అవకతవకలను అరికట్టేందుకు విజిలెన్స్ విభాగం నిరంతరం కృషి చేస్తోందని ఇంచార్జ్ జీఎం తెలిపారు. ఉద్యోగులు, అధికారులకు అవగాహన కల్పిస్తూ, నైతిక విలువలను పెంపొందించేందుకు విజిలెన్స్ విభాగం నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. అవినీతిని కేవలం నియంత్రణ చర్యలతోనే కాకుండా, ప్రతి ఒక్కరిలో నిజాయితీ పట్ల నిబద్ధతను పెంపొందించడం ద్వారా సమర్థవంతంగా అరికట్టవచ్చని అన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిజాయితీని కేవలం ఒక నినాదంగా కాకుండా, నిత్య జీవితంలోనూ, విధి నిర్వహణలోనూ పాటించే జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ఇంచార్జ్ జీఎం సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో నిజాయితీని పాటించడం, అవినీతికి దూరంగా ఉండడం, పారదర్శకతతో వ్యవహరించడం, సంస్థ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల్లో నైతిక విలువలు, అవినీతి నిరోధక ఆలోచనా విధానం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, కమ్యూనికేషన్ సెల్ అండ్ సేవా కోఆర్డినేటింగ్ ఆఫీసర్, సీనియర్ పీఓ సత్యనారాయణ, జీఎం కార్యాలయ ఫిట్ సెక్రటరీ గీతికతో పాటు జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

Regd.No.197/2012

SRI SAI VRUDDHA ASHRAMA WELFARE SOCIETY

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/26/A4267

సత్య దీపిక

ఉదయం

www.satyadeepikaudayam.com

తెలంగాణ ప్రజల గొంతుక ..నిజాలు వెలుగుల్లోకి

బాసర ఐఐఐటిలో నీటి ఇబ్బందులు కలగకుండా

పటిష్ట చర్యలు

- రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభిస్తాం- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.


8లో

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కీలక ముందడుగు!



▶ మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
▶ రెండు రాష్ట్రాలకు వారధి
▶ తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు
▶ రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారది ▶ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
▶ సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం

9లో

రూ.140 బిర్యానీ.. ఆరోగ్యానికి ఎంత 'ధర'?



8లో

మంచిర్యాల జిల్లా కేంద్రంలో రూ.140కే చికెన్ బిర్యానీ విక్రయిస్తున్న ఓ ప్రముఖ బిర్యానీ సెంటర్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తక్కువ ధరకు భారీగా విక్రయాలు జరుగుతున్నాయన్న ప్రచారం, రోజుకు సుమారు 200 కిలోల వరకు చికెన్ వినియోగమంటూ వినిపిస్తున్న సమాచారం, రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ముడిసరుకుల నిల్వ, ప్రజల ఆరోగ్య భద్రతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రచారంలో వాస్తవాలేమిటో సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీం చేసిన

పోరాటం చిరస్మరణీయం

- జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన మహనీయుని ఆశయాల సాధనకు కృషి చేయాలి: మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దనసరి సీతక్క

ఆదిలాబాదు ఉమ్మడి జిల్లా ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి



చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. కొమురంభీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. (మిగితా..9 లో)

చెన్నూర్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి

ప్రత్యేక ప్రాధాన్యత

మంచిర్యా ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

చెన్నూర్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ్న రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. భాస్కర్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూరు పట్టణానికి నూతన రూపు తీసుకురావాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారుల సహకారంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని, బైపాస్ రోడ్డును రికార్డు సమయంలో పూర్తి చేసామని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వ్యాపారులకు అండగా, హామీ మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి



ప్రస్తుతం 20 షాపుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన వ్యాపారులకు మరో 50 షాపుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజారోగ్య– మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ జంక్షన్ నుండి పెద్ద చెరువు (రావి చెట్టు) వరకు బి.టి. రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం, సెంట్రల్ మీడియన్ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు, మహంకాళి ఆలయం నుండి జాతీయ రహదారి 63 (గోదావరి రోడ్డు) వరకు 3 కోట్ల 50 లక్షల రూపాయలతో సి.సి. రోడ్డు విస్తరణ, జాతీయ రహదారి 63 నుండి గోదావరి పుష్కర ఘాట్ వరకు 6 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు

- గోదావరి పుష్కరాల పనులు, పర్యాటక అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సమస్యల తక్షణ పరిష్కారం - రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

విస్తరణ, సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటు, పుష్కర ఘాట్ సమీపంలో 50 లక్షల రూపాయల వ్యయంతో హైమాస్ లైటింగ్ ఏర్పాటు కొరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో చెన్నూర్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు 70 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, పుష్కరాల ఘాట్లకు వెళ్లే రహదారిపై ఇప్పటికే కొంతమేర సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు రాకపోకలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ రహదారుల నిర్మాణంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో పనులను త్వరగా ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాలలోని అంతర్గత రహదారులతో పాటు శ్మశానవాటికలకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కోటపల్లి ప్రాంతంలో ఎస్.సి. వసతి గృహానికి అవసరమైన నిధుల కేటాయింపు, సంబంధిత అభివృద్ధి చర్యలపై దృష్టి సాధించడం జరిగిందని తెలిపారు. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా జైపూర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మొసళ్ళ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి ప్రాంతంలోని గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు తగిన ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ పనులలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. (మిగితా..8లో)

ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



మంచిర్యాల,అక్టోబర్ 26, సత్యదీపిక ఉదయం :

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి



అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతుందని, నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,సత్యదీపిక ఉదయం :

భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం బాసర మండలంలోని మధాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి గ్రామంలో చేపట్టిన రీసర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది తప్పనిసరి క్షేత్రస్థాయి సర్వే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. సర్వే నిర్వహణకు సంబంధించిన రైతులకు సమాచారం ముందుగానే అందించాలన్నారు. సంబంధిత కమతాల రైతులంతా సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని వివరించారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, రెవెన్యూ, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బాసర ఐఐఐటీలో నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు

- రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభిస్తాం - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

బాసర ఐఐఐటి (ఆర్జియుకేటీ)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటి ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఐఐఐటి లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి పదివేల మంది వరకు ఉంటారని, వారికి తాగునీరు, రోజువారి అవసరాల నిమిత్తం ప్రతి రోజూ దాదాపు15 లక్షల లీటర్ల వరకు నీరు కావాలని అన్నారు. గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఐఐఐటి కోసం 60 హెచ్ పి సామర్థ్యం గల మూడు మోటార్లు అందుబాటులో ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒకటి పూర్తిస్థాయిలో పని చేయగా, రెండు పనిచేయడం లేదని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రాగానే రెండు మోటార్ల మరమ్మత్తుల కొరకు 8 లక్షల రూపాయలను కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే సంబంధిత సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్ ను సందర్శించిందని తెలిపారు. పది రోజుల్లోనే రెండు మోటార్లను బాగు చేసి నీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఒక మోటారు దాదాపు రోజుకు 25 లక్షల లీటర్లను సరఫరా చేయగలదని వివరించారు. ఈ నీరు ఐఐఐటి రోజువారీ అవసరాలకు సరిపోతుందని చెప్పారు. పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మరొక నూతన మోటార్ ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐఐఐటి అవసరాలకు ఇంకనూ నీరు అవసరమైతే రోజుకు 10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉన్న గ్రామపంచాయతీ ఇంటెక్ వెల్ నుంచి 1.3 నుంచి 1.5 ఎంఎల్ డి నీటిని అందిస్తామని అన్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.ఐఐఐటి ప్రాంగణంలో 29 ఎకరాల విస్తీర్ణంలో నీటి నిల్వ కుంట అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఐఐఐటి అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం ఆ కుంటను శుభ్రం చేసి మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లోనే భౌతిక తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు రోజువారి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నీరు తగినంత లభ్యంగా ఉందని, నీటి సరఫరా లోనే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.అంతకుముందు గోదావరి నది వద్ద గల ఐఐఐటికి నీటిని సరఫరా చేసే ఇంటెక్ వెల్ ను పరిశీలించారు. నీటి సరఫరా కు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.రెండు మోటార్లకు అవసరమైన పరికరాలను తెప్పించి, వీలైనంత త్వరగా మరమ్మతులను పూర్తిచేయాలని అన్నారు. ఆ తర్వాత ఐఐఐటి ప్రాంగణంలోని నీటి కుంటను, పంపుహౌస్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డిఈఈ, ఈఈ లు రాజేశ్వర్ రావు రాఘవేంద్ర రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, ఐఐఐటి డీన్ లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుండి నుంచి హైదరాబాద్ సెక్రటేరియట్ వరకు సైకిల్ యాత్ర



తాండూరు, సత్యదీపిక ఉదయం :

గత 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న గుండి బ్రిడ్జి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలనే లక్ష్యంతో కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గుండి గ్రామ యువత సోమవారం సైకిల్ యాత్రను ప్రారంభించారు గుండి , ఆసిఫాబాద్ గ్రామం మీదుగా హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివా లయం వరకు సైకిల్ యాత్ర లో భాగంగా తాండూర్ మండల కేంద్రానికి సోమవారం మధ్యాహ్నం సైకిల్ యాత్ర చేరుకుంది ఈ సందర్భంగా సైకిల్ యాత్ర చేపట్టిన యువకుడు మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండి గ్రామానికి 2006 సంవత్సరంలో 10.08 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించినప్పటికీ 20 సంవత్సరాలు అయినా ఇప్పటివరకు పూర్తి కాలేదని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని కనీస సౌకర్యాలైన విద్యా వైద్యానికి ఇబ్బంది అవుతుందని ప్రతిదానికి పట్టణానికి రావాల్సి ఉండగా గ్రామ ప్రజలు మహిళలు ముసలివారు పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఏ నాయకులు వచ్చిన వట్టి మాటలే మాట్లాడుతున్నారని ఏ నాయకులకు పట్టింపు లేదని మా సమస్యను శాంతియుతంగా సైకిల్ యాత్రతో సెక్రెటరీ కు చేరుకొని ముఖ్యమంత్రికి తెలియజేస్తామని తెలిపారు.

రూ.140 బిర్యానీ.. ఆరోగ్యానికి ఎంత 'ధర'?



మమంచిర్యాల బ్యూరో ,సత్యదీపిక ఉదయం :

మంచిర్యాల జిల్లా కేంద్రంలో రూ.140కే చికెన్ బిర్యానీ విక్రయిస్తున్న ఓ ప్రముఖ బిర్యానీ సెంటర్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తక్కువ ధరకు భారీగా విక్రయాలు జరుగుతున్నాయన్న ప్రచారం, రోజుకు సుమారు 200 కిలోల వరకు చికెన్ వినియోగమంటూ వినిపిస్తున్న సమాచారం, రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ముడిసరుకుల నిల్వ, ప్రజల ఆరోగ్య భద్రతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రచారంలో వాస్తవాలేమిటో సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రూ.300--350 బిర్యానీ.. రూ.140కే ఎలా?

సాధారణంగా కొన్ని హోటళ్లలో చికెన్ బిర్యానీ రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తుండగా, ఇక్కడ రూ.140కే అందుబాటులో ఉండటం వినియోగదారులను ఆకర్షిస్తోంది.చికెన్, బియ్యం, వంట నూనె,మసాలాలు,గ్యాస్,విద్యుత్,సిబ్బంది వేతనాలు,అద్దె, ప్యాకింగ్ తదితర ఖర్చుల మధ్య ఇంత తక్కువ ధరకు భారీగా విక్రయాలు ఎలా సాధ్యమవుతున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ధర తక్కువగా ఉండటమే నాణ్యత లోపానికి ఆధారం కాదని, వాస్తవ పరిస్థితిని తనిఖీలు, పరీక్షల ద్వారానే నిర్ధారించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రోజుకు 200 కిలోల చికెన్ .. ప్రచారంలో వాస్తవమెంత?

ఈ బిర్యానీ సెంటర్‌లో రోజుకు సుమారు 200 కిలోల వరకు చికెన్ వినియోగం జరుగుతోందన్న ప్రచారం నేపథ్యంలో అధికారులు కొనుగోలు బిల్లులు, సరఫరాదారుల వివరాలు, చికెన్ నిల్వ సామర్థ్యం, శీతలీకరణ సదుపాయాలను పరిశీలించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ప్రతిరోజూ తాజా చికెన్ వినియోగిస్తున్నారా? ముడి చికెన్‌ను సురక్షిత ఉష్ణోగ్రతల్లో నిల్వ చేస్తున్నారా? వంటశాలలో పరిశుభ్రత పాటిస్తున్నారా? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చైనా ఉప్పు.. రుచివర్ధకాలు వాడుతున్నారా?

బిర్యానీ రుచి, వాసన కోసం ఉపయోగించే మసాలాలు, ఫ్లేవర్స్, ఎంఎస్‌జీ వంటి రుచివర్ధక పదార్థాలు నాణ్యమైనవేనా? ఆహార భద్రతా నిబంధనల ప్రకారం అనుమతించిన పదార్థాలనే వినియోగిస్తున్నారా? నిర్దేశిత పరిమితులను పాటిస్తున్నారా? అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా 'చైనా ఉప్పు'గా పిలిచే రుచివర్ధక పదార్థాలతో పాటు ఇతర సంకలితాల వినియోగంపై అనుమానాలుంటే వాటి నమూనాలను సేకరించి శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

నాణ్యత లేని లేదా కలుషితమైన ఆహారం వల్ల ఆహార విషబాధ,విరేచనాలు, ఇతర జీర్ణకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తుంటారు.అయితే ఏదైనా పదార్థం వల్ల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని నిర్దిష్టంగా చెప్పాలంటే శాస్త్రీయ ఆధారాలు అవసరం. అందువల్ల ప్రచారాల ఆధారంగా నిర్ధారణలకు రాకుండా పరీక్షల ఫలితాల ఆధారంగా వాస్తవాలను వెల్లడించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రాత్రి మిగిలిన బిర్యానీ.. మరుసటి రోజు విక్రయిస్తున్నారా?

ప్రజల్లో వ్యక్తమవుతున్న మరో ప్రధాన సందేహం మిగిలిపోయిన ఆహార నిర్వహణపై. రాత్రి మిగిలిన బిర్యానీని మరుసటి రోజు విక్రయిస్తున్నారా? మిగిలిన చికెన్‌ను తిరిగి వంటలో వినియోగిస్తున్నారా? చికెన్ సూప్‌ను మళ్లీ వేడి చేసి విక్రయిస్తున్నారా? వండిన ఆహారాన్ని ఎంతసేపు, ఏ ఉష్ణోగ్రతలో నిల్వ చేస్తున్నారు? అన్న అంశాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరుతున్నారు.

ఆహారాన్ని సురక్షితంగా నిల్వ చేయడం, ముడి పదార్థాలు--వండిన ఆహారాన్ని వేర్వేరుగా నిర్వహించడం, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, వంటశాల శుభ్రత వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు .. రోడ్లపైనే పార్కింగ్!

బిర్యానీ సెంటర్‌లో రాత్రి 12 గంటల వరకు విక్రయాలు కొనసాగుతున్నాయన్న సమాచారంపై వ్యాపార నిర్వహణకు వర్తించే అనుమతులు, మున్సిపల్ నిబంధనలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు వినియోగదారుల వాహనాలు రహదారులపై నిలిపితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి భద్రత, పార్కింగ్ నిర్వహణపై సంబంధిత శాఖలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారా?

భారీ స్థాయిలో వ్యాపారం జరుగుతున్న నేపథ్యంలో వర్తించే పన్నులు, వ్యాపార రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? జీఎస్టీతో పాటు ఇతర చట్టబద్ధ పన్నుల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా? అన్న అంశాలపై సంబంధిత వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తమ పరిధిలో పరిశీలన చేయాలని ప్రజలు కోరుతున్నారు. పన్నుల విషయంలో ఎలాంటి ఉల్లంఘన జరిగిందని ముందుగానే నిర్ధారించకుండా, రికార్డులు, లావాదేవీల ఆధారంగా వాస్తవాలను తేల్చాలని అంటున్నారు.

చికెన్ నుంచి తాగునీటి వరకు .. నమూనాలు సేకరించాలి

ప్రజల్లో నెలకొన్న సందేహాలకు శాస్త్రీయంగా సమాధానం లభించాలంటే ఆహార భద్రతా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చికెన్, తయారైన బిర్యానీ, వంట నూనె, బియ్యం, మసాలాలు, రుచివర్ధక పదార్థాలు, తాగునీటి నమూనాలను సేకరించి గుర్తింపు పొందిన ప్రయోగశాలలకు పంపించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అదేవిధంగా ఆహార భద్రత లైసెన్స్, వంటశాల పరిశుభ్రత,ఫ్రీజర్లు, ఆహార నిల్వ విధానం, ముడిసరుకుల కొనుగోలు బిల్లులు, సరఫరాదారుల వివరాలు, వర్తించే మున్సిపల్ అనుమతులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'రైడ్'తో సరిపెట్టొద్దు .. సమగ్ర విచారణతో నిజం తేల్చాలి!

ఒక్కసారి తనిఖీ చేసి వెళ్లిపోవడం కాకుండా, అవసరమైన అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ చేపట్టి, నమూనా పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం వాస్తవాలను అధికారికంగా వెల్లడించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఆహార భద్రత, మున్సిపల్, పోలీసు, వాణిజ్య పన్నుల శాఖలు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధర కాదు.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యం!

రూ.140 బిర్యానీ కావచ్చు.. రూ.350 బిర్యానీ కావచ్చు.. ధర ఎంతైనా ఆహారం నాణ్యంగా, పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండటమే ముఖ్యమని పట్టణవాసులు పేర్కొంటున్నారు. ప్రచారాలు, అనుమానాలే ఆధారాలుగా మారకుండా అధికారిక తనిఖీలు, ప్రయోగశాల నివేదికల ఆధారంగా నిజానిజాలు ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

చెన్నూర్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి
ప్రత్యేక ప్రాధాన్యత

- గోదావరి పుష్కరాల పనులు, పర్యాటక అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి - ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సమస్యల తక్షణ పరిష్కారం - రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

మొదటి పేజీ తరువాయి...

సుద్దాల గ్రామంలో ఇసుక సరఫరాకు సంబంధించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులలో ఇళ్ల నిర్మాణ పురోగతిని ప్రజా ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలు ప్రారంభించని / నెమ్మదిగా కొనసాగుతున్న ఇండ్లను గుర్తించి లబ్ధిదారులకు సహకరించాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పనుల అమలులో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బైపాస్ సమీపంలో 6 కోట్ల రూపాయలతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండగా, మరో ప్రాంతంలో సుమారు 3 కోట్ల 50 లక్షల రూపాయలతో రహదారి నిర్మాణ



పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ తదితర సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులను వేగవంతం చేయడం జరుగుతుందని, 2 వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, 3వ ట్యాంకు పనులను త్వరితగతిన పూర్తి చేసి నీటి సరఫరాను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. అన్ని వార్డులలో సోలార్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సాధించడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు ఆసుపత్రి, విద్యాసంస్థలు, ఇతర ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం జైపూర్ మండలం వేలాల గ్రామంలో మల్లన్న స్వామిని దర్శించుకుని, గోదావరి తీరంలో నీటిపారుదల- ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 4 కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్, ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల కోసం 70 కోట్ల రూపాయలు, చెన్నూర్ లోని శివాలయ అభివృద్ధికి 17 కోట్ల రూపాయల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మొసళ్ల పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించి, గాంధారి మైసమ్మ ఆలయం తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక



కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంట్ విస్తరణ ద్వారా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థకు చెందిన ఆర్‌కే ఓసీ గని ప్రారంభంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మందమరిలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం సుమారు 70 మంది శిక్షణ పొందుతున్నారని, అర్హత సాధించిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లో 100 పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గంలో 12 వేల నుంచి 15 వేల ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే సుమారు 5 వేల ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వాతావరణ పరిస్థితులను ప్రజలందరూ సమిష్టిగా ఎదుర్కోవాలని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మిడి హెట్టి పై కీలక ముందడు

- మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ- రెండు రాష్ట్రాలకు వారధి- తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు- రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారది- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం





హైదరాబాదు బ్యూరో,సత్యదీపిక ఉదయం :

మతెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం కావడంతో తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు పై ముందగు పడినట్లు అయింది. సోమవారం ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , తెలంగాణ, మహారాష్ట్రల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు.సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రతినిధి బృందం దృష్టికి తీసుకెళ్లారు.సుసంపన్నమైన చరిత్ర,సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు.

ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్ బీ చవాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను తెలిపారు. 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు,చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు.

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు.సాంకేతిక, నిర్వహణ,ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

రెండు రాష్ట్రాలకు వారధి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ – మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు.అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు.దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు.మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు.గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (CWC) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు.ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు.ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు.ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.రెండు రాష్ట్రాల అధికారులు,సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ,కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఎస్ఐఆర్ పెండింగ్

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అదిలాబాదు ప్రతినిధి,అక్టోబర్26,సత్యదీపిక ఉదయం :



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, ఫారం– 6,7,8 దరఖాస్తుల పెండింగ్, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఫారం–6, 7,8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతలను నిర్ధారించాలన్నారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అనర్హతకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేసి, సంబంధిత ఆధారాలతో సహా పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలన్నారు. నవంబర్ 5వ తేదీ



లోపు అన్ని ఇనుమరేషన్ ఫారాలు పూర్తి చేయాలని, ప్రతి బిఎల్ఓ దగ్గర ఎనిమిరేషన్ ఫామ్ ఓటరు లకు ఇచ్చిన రసీదు, ఫారం –7 కి సంబంధించిన రసీదు లు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రూ, డిఆర్ఓ స్రవంతి, ఆర్డిఓ జగదీశ్వర్ రావు ఎన్నికల విభాగం పర్యవేక్షణ నలంద ప్రియ, ఎన్నికల నాయబ్ తహసిల్దార్ మధుసూదన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీం చేసిన పోరాటం చిరస్మరణీయం

- జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన మహనీయుని ఆశయాల సాధనకు కృషి చేయాలి: మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దనసరి సీతక్క

ఆదిలాబదు ఉమ్మడి జిల్లా ప్రతినిధి,
అక్టోబర్ 26, సత్యదీపిక ఉదయం :

ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన అమరజీవి కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.గిరిజనులకు సంబంధించిన జీఓల అమలుపై వచ్చిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. సంబంధిత జీఓల అమలుకు పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరిస్తూ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న కాస్మెటిక్, డైట్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన విద్య



అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు.సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలు, అటవీశాఖ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని పంపిస్తామని తెలిపారు. అక్కడ అమలవుతున్న మంచి విధానాలను పరిశీలించి, అవసరమైన వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమురం భీం: మంత్రి సీతక్క

మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక



అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కొమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ, బిర్సా ముండా వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. ఆదివాసీల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. యువత విద్యపై దృష్టి సారించి ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ.. కొమురం భీం ఆదివాసీల ముద్దుబిడ్డ, జాతిరత్నమన్నారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీఎఫ్‌డీ, జన్‌మన్, ఆర్టికల్ 275(1) తదితర కేంద్ర నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.

ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కొమురం భీం తన ప్రాణాలను సైతం అర్పించారని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరించడంతో పాటు మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. కొమురం భీం ఆశయాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆసిఫాబాద్, సిర్పూర్, కాగజ్‌నగర్, ఖానాపూర్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బోజ్జు పటేల్ మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడు కొమురం భీం ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరీత మాట్లాడుతూ కొమురం భీం పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (CWC) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు.ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు.ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు.ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.రెండు రాష్ట్రాల అధికారులు,సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ,కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోండి భాషలో ప్రసంగిస్తూ గిరిజన ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గుస్సాడీ, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.అంతకుముందు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్ లను మంత్రులు, అధికారులు సందర్శించారు.కార్యక్రమంలో కొమురం భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జోయల్, ప్రజాప్రతినిధులు, గిరిజన ప్రజలు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అచలాపూర్ విద్యార్థిని చౌల్ల హర్షిత ఎంపిక

తాండూరు,సత్యదీపిక ఉదయం

ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జెడ్పి హెచ్ ఎస్ అచలాపూర్ విద్యార్థిని చౌల్ల హర్షిత ఎంపికైనట్లు పిడి ఏ సాంబమూర్తి తెలిపారు. నిన్న పాఠశాల క్రీడా సమాఖ్య వారి



ఆధ్వర్యంలలో ట్రినిటీ హైస్కూల్ మంచిర్యాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలలో మంచిర్యాల జిల్లా జట్టు గోల్డ్ మెడల్ సాధించి మొదటి స్థానంలో నిలిచినది. మంచిర్యాల జిల్లా జట్టుకి ప్రాతినిధ్యం వహించిన చౌల్ల హర్షిత10వ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వచ్చేనెల మహబూబ్ నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం జరిగినది.ఈ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనటువంటి విద్యార్థినినీ పాఠశాలప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఏఏపిసి చైర్మన్ చిలుకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, వార్డు మెంబర్ పాపయ్య, సీనియర్ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయబృందం అభినందించారు.

ఖానాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

-ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు షేక్ షకీల్

ఖానాపూర్, అక్టోబర్ 26, సత్య దీపిక ఉదయం

ఖానాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ, యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు షేక్ షకీల్ మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో రాధ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా



షేక్ షకీల్ మాట్లాడుతూ, ఖానాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించి చదవలేక చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడంతో, ఖానాపూర్ పట్టణానికి చెందిన విద్యార్థులు దాదాపు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్మల్ కు, అలాగే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు 50 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి డిగ్రీ విద్యను అభ్యసించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు భరించలేక,ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వివరించారు.స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైతే, డ్రాప్-అవుట్ రేటు గణనీయంగా తగ్గడంతో పాటు, మహిళా విద్యార్థులకు భద్రత, పేద విద్యార్థులకు ఉచిత విద్య అందుతుందని అన్నారు. కావున, ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తక్షణమే ఖానాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలనుమంజూరుచేయాలనిఆయన వినతిపత్రంలో కోరారు.

ఇంగ్లీష్ గ్రామరే భవిష్యత్తుకు పాస్ పోర్ట్ ... అమంద శంకర్ ప్రముఖ విద్యావేత్త

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 26, సత్య దీపిక ఉదయం.

ఇంగ్లీష్ గ్రామర్ తోనే ఇంగ్లీష్ లో నైపుణ్యం సాధించవచ్చని, ఇంగ్లీష్ గ్రామరే భవిష్యత్తుకు పాస్ పోర్ట్ అని ప్రముఖ విద్యావేత్త అమంద శంకర్ అన్నారు.గ్రామీణ



ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మాట్లాడటం సరిగా రాదని, పట్టణ ప్రాంతాల్లో చుట్టుపక్కల వారు ఇంగ్లీష్ మాట్లాడటం వల్ల అక్కడి పిల్లలకు చిన్నప్పటి నుండే ఇంగ్లీష్ మాట్లాడడం అలవాటవుతుందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఆ వాతావరణం లేకపోవడంతో విద్యార్థులు ఇంగ్లీష్ లో మాట్లాడలేక ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు.ఇంగ్లీష్ మాట్లాడడం రాని విద్యార్థులు మొదట ఇంగ్లీష్ గ్రామర్ నేర్చుకుని, ఆ తర్వాత స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకుంటే సులభంగా ఇంగ్లీష్ మాట్లాడడం వస్తుందని తెలిపారు. ఇంగ్లీష్ గ్రామర్ నేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, స్పోకెన్ ఇంగ్లీష్ సులభంగా వస్తుందని, పోటీ పరీక్షల్లో ఇంగ్లీష్ గ్రామర్ కు ప్రత్యేకంగా మార్కులు ఉంటాయని అన్నారు. నిజానికి ఇప్పుడు కంపెనీలు మార్కుల కంటే ముందు మనం పంపే చిన్న ఈ-మెయిల్ ను చూస్తున్నాయని, రెజ్యూమ్ లో ఒక చిన్న గ్రామర్ తప్పు ఉంటే ఇంటర్వ్యూ లేకుండానే తిరస్కరిస్తున్నారని చెప్పారు.గ్రామర్ సరిగా తెలిసిన వ్యక్తి ఏ విషయాన్నైనా ఎదుటివారికి అర్థమయ్యేలా, గందరగోళం లేకుండా చెప్పగలరని, గ్రామర్ తెలియని వారు ఏదో ఒకటి చెబితే దాని అర్థం పూర్తిగా మారిపోతుందని అన్నారు.ఉన్నత చదువులు చదవాలన్న, విదేశాలకు వెళ్లాలన్నా గ్రామర్ నేర్చుకోవాలి అన్నారు. యూపీఎస్సీ, బ్యాంకు, ఐఈఎల్టీఎస్ లాంటి పరీక్షల్లోనూ గ్రామర్ వల్ల ఎక్కువ మార్కులు వస్తాయని, అన్నింటికంటే ముఖ్యంగా కరెక్ట్ ఇంగ్లీష్ వస్తే భయం పోయి ఆత్మవిశ్వాసం వస్తుందని అన్నారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, ఇంగ్లీష్ లో ఒక లైన్ కూడా కరెక్ట్ గా రాయలేక, ఇంటర్వ్యూల్లో వెనక్కి వస్తున్నారని, వాట్సాప్ మెసేజ్ లు, ఆఫీస్ మెయిల్స్ లో చిన్న తప్పుల వల్ల ఇమేజ్ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉద్యోగాల డిస్క్రిప్టివ్ పేపర్లలో గ్రామర్ తప్పులకు మార్కులలో కోత విధిస్తున్నారని, సోషల్ మీడియాలో తప్పు ఇంగ్లీష్ పెడితే అపహాస్యానికి గురవుతున్నారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు గ్రామర్ వస్తుందో లేదో తెలుసుకుని, ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ఆయన సూచించారు.

జిల్లాలో తాగునీరు, విద్యుత్ సరఫరాకు పకడ్బందీ చర్యలు: కలెక్టర్ రాజర్షిషా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

జిల్లాలో తాగునీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థలను మరింత మెరుగుపర్చాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని తన చాంబర్లో తాగునీరు, పైప్లైన్ల నిర్మాణం, బోర్వెల్స్, మోటార్ల మరమ్మతులతో పాటు విద్యుత్ సరఫరా, యాసంగి సాగు, నీటి సంరక్షణ తదితర కీలక అంశాలపై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పంటల సాగు, భూగర్భ జలాల పరిరక్షణపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ భవన నిర్మాణ అనుమతుల్లో ఇంకుడు గుంతలు తప్పనిసరి చేయాలని, నిబంధనలు పాటించని పక్షంలో మోర్టగేజ్ విడుదల చేయరాదని స్పష్టం చేశారు. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే కూరగాయలు, పసుపు (టర్మరిక్), సీడ్ స్పేసెస్ వంటి



ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లేలా వ్యవసాయ, ఉద్యాన శాఖలు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు విత్తనాలు వేయడం తదితర వ్యవసాయ ఆధారిత పనులను పెద్దఎత్తన కల్పించాలన్నారు. జిల్లాలో సీఆర్ఎఫ్, నాన్-సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న పైప్లైన్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట తాత్కాలిక బోర్లు ఏర్పాటు చేసి పైప్లైన్ కనెక్షన్లు ఇవ్వాలని, బోర్ల ద్వారా తాగునీటిని సేకరించి ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని, ప్రత్యేకించి రాత్రి వేళల్లో తగిన పవర్ సప్లై ఉండేలా గ్రిడ్ స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎంబీవో, ఏఈఆర్డబ్ల్యూఎస్ అధికారులు జాయింట్గా క్షేత్రస్థాయిలో పర్యటించి, పంచాయతీ కార్యదర్శులతో కలిసి మండలాల్లో సమీక్షలు నిర్వహించి సమగ్ర



యాక్షన్ ప్లాన్ సమర్పించాలని ఆదేశించారు. లీకేజీలను తక్షణమే అరికట్టడంతో పాటు మోటార్లు, ఆన్-ఆఫ్ స్విచ్లు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పశువులకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రెడ్కో సంస్థ ద్వారా సోలార్ విద్యుత్, రూఫ్టాప్ సిస్టమ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ సుభాష్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రవణ్ కుమార్, ఈఈ చంద్రమోహన్, భూగర్భజల శాఖ ఏడీ సతీష్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, డీఎల్పీవో ఫణిందర్, రెడ్కో జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ, మున్సిపల్ డీఈ సందీప్, ఈఈ అరుణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

- జల, విద్యుత్ సంరక్షణకు పెద్దపీట వేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అదిలాబాదు టౌన్,సత్యదీపిక ఉదయం :

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్వయంగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్నారు. ఈ ప్రజావాణిలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూసమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి జిల్లా, మండల స్థాయిల్లో 66 ఫిర్యాదులు, వినతులను రావడం జరిగిందని వెల్లడించారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో జల, విద్యుత్ సంరక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా అంశాలపై అన్ని శాఖల అధికారులు, ప్రైవేట్ నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, జీపీ భవనాలు, ప్రైవేట్



రెసిడెన్షియల్స్లో రూఫ్టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే 3 కిలోవాట్ల సిస్టమ్కు రూ. 78,000 వరకు సబ్సిడీతో పాటు బ్యాంక్ లోన్ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ నిధులను వెచ్చించేటప్పుడు ప్రథమ ప్రాధాన్యత తాగునీరు, ఆ తర్వాత శానిటేషన్, వాటర్ కన్జర్వేషన్, ఎనర్జీ కన్జర్వేషన్ పనులకు కేటాయించాలని స్పష్టం చేశారు. తగిన అనుమతులు లేకుండా కొత్త బోర్వెల్స్ తవ్వరాదని, బోరుబావులు, రూఫ్టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ఏర్పాటును తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వాహనాలు కడగడానికి పైపులు వాడకుండా, తడి గుడ్డను ఉపయోగించి నీటి వృధాను అరికట్టాలని, అలాగే వృధా అయ్యే నీటిని గార్డెనింగ్కు మళ్లించాలని సూచించారు. కార్యాలయాల్లో ఏసీ ఉష్ణోగ్రతలను 24 నుండి 25 డిగ్రీల సెల్సియస్ మధ్యలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో నీటి, విద్యుత్ సంరక్షణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొమురంభీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.. జిల్లా కలెక్టర్ రాజర్షి షా

- గంజాయి, సారా సాగుకు దూరంగా ఉండాలి:
- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం

జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ సమీపంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆయన 86వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, వివిధ శాఖల అధికారులు,



ప్రజాప్రతినిధులు, ఆదివాసి నాయకులు పాల్గొని కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంజీ గోండు విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంతకుముందు ఆదివాసీ సంప్రదాయాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించి కలెక్టర్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొమురం భీమ్ కేవలం ఆదివాసులతో పాటు మొత్తం జిల్లాకే మంచి మార్గదర్శి అని, ఆయన కోరుకున్న 'జల, జంగల్, జమీన్' సాధన కోసం అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోడు పట్టాలు, రైతు భరోసా, ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలను బడికి క్రమం తప్పకుండా పంపాలని, మూఢనమ్మకాలకు పోకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉన్నందున నీటి సంరక్షణ అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చి, ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పద్ధతుల ద్వారా నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, కొమరం భీమ్ ఆశయ సాధనే లక్ష్యంగా జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అధికారులు, గిరిజన నాయకులు సమన్వయంతో పనిచేసి సంక్షేమ ఫలాలను అర్హులందరికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను చదివిస్తే వారు ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదుగుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రిమ్స్ ఆసుపత్రితో పాటు గిరిజనుల కోసం ప్రత్యేకంగా అనువాదకులను (ట్రాన్స్లేటర్స్) సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చిన్నచిన్న సమస్యలను రాయి సెంటర్లు పోలీస్ స్టేషన్ల ద్వారా అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని, ఇటీవల కాలంలో కొందరికి జైలు శిక్షలు పడినట్లు ఉదాహరణలతో వివరించారు. కావున ఆదివాసీ యువత చెడు అలవాట్లకు బానిసకాకుండా, గంజాయి సాగుకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ అనూష మాట్లాడుతూ, ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే కొమురం భీమ్ కు మనం ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. ప్రతి ఒక్కరు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ జీవన్రెడ్డి, ఆదివాసీ నాయకులు రామ్కిషన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

- అవసరమైతే మొక్కలు నాటి వనాన్ని అభివృద్ధి చేస్తాం

తాండూరు,సత్యదీపిక ఉదయం

యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడా మైదానాలు ఎంతో అవసరం. అలాంటి మైదానాలను అందరికీ అందుబాటులో, అనువైన వాతావరణంలో ఏర్పాటు



సర్పంచ్ కు వినతి పత్రం అందజేసిన యువత (ఫైల్ ఫోటో)

చేయాల్సిన అధికారులు స్థల ఎంపికలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తాండూరు మండలంలోని రేచిని గ్రామ యువత, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని సుద్దోడ్ల ప్రాంతంలో ఒకవైపు శ్మశాన వాటిక, మరోవైపు చెత్త డంపింగ్ యార్డు పక్కనే తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానం ఒకవైపు.. చెత్త డంపింగ్ యార్డు మరోవైపు.. మధ్యలో క్రీడా మైదానం ఉంటే యువత ఆటలు ఆడేదెలా? అని ప్రశ్నిస్తున్నారు. క్రీడా మైదానం అంటే కేవలం బోర్డు ఏర్పాటు చేయడం కాదని, విద్యార్థులు, యువత ఏ సమయంలోనైనా వెళ్లి సురక్షితంగా ఆటలు ఆడుకునేలా అనువైన వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు యువత అభివృద్ధికి ఎన్నో చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శిస్తున్నారు. యువతను చెడు వ్యసనాలకు దూరం చేయాల్సిన క్రీడా మైదానాన్ని ఇలాంటి ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుంది? అని నిలదీస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి సమీపంలో ఉన్న పల్లె ప్రకృతి వనం స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేసి, ప్రస్తుతం క్రీడా ప్రాంగణంగా కేటాయించిన స్థలాన్ని పల్లె ప్రకృతి వనంగా మార్చే అవకాశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని యువత ప్రతిపాదిస్తున్నారు. అవసరమైతే తామంతా కలిసికట్టుగా మొక్కలు నాటి పల్లె ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రతిపాదన అమలైతే క్రీడా మైదానం గ్రామ ప్రజలకు, విద్యార్థులకు, యువతకు మరింత చేరువగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా సమస్యపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అనువైన స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రేచిని గ్రామ యువత, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రీడా ప్రాంగణాన్ని అనువైన స్థలానికి మార్చాలని, తమ ప్రతిపాదనను అధికారులు సానుకూలంగా పరిశీలించాలని కోరుతున్నారు.

ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలు

ఖానాపూర్, అక్టోబర్ 26, సత్యదీపిక ఉదయం

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, ఖానాపూర్ మండలం మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన అనే అంశాలపై హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపారు.పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు వ్యాసాలను రికార్డు కోసం ఎంపిక చేసినట్లు ఆయన తెలిపినారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

